TPLA126B.123

కృతజ్ఞత!!

మా గ్రంథమాలకు

నలుబదిరూపాయలు సహాయంచేసిన

వరంగల్ పట్టణ నివాసులగు

కొండూరు రామలింగం, బుచ్చిరాజలింగం

ముంకెయ్యలింగంగార్లకు

మే మొంతయు కృతజ్ఞులము!

అంకితము !!!

—o—o—

నన్ను చిన్నప్పటినుండియు

అత్యంత గారాబముతో పెంచి

కన్నకుమారునికన్న మిన్నగా తనపవిత్రప్రేమలో ముంచివేసి

నా 13 వ యేటనే నన్ను ప్రేమవంచితునిజేసి స్వర్గస్థుడైన

మా పెదనాయనగారగు

ముదిగొండ మంత్రయ్యగారి ఆత్మకు

అంకితము !

ఇట్లు.
గ్రంథకర్త.

రెండుమాటలు !!!

పాఠకమహాశయులారా !!

మామిత్రులు కొందరు చాలప్రోత్సహించి, ఒక నవలవ్రాయవలసినదిగా చాల బలాత్కారం చేయటంచేతనే నేనీవిధంగా సాహసింపవలసివచ్చింది!! నేను చాల అల్పజ్ఞుణ్ణి! ఆంధ్రభాషలో నాకు తగిన ప్రవేశం లేకపోవడం నాదురదృష్టం! ఆంధ్ర నవలాలోకంలో అనేకమంది రచనలలోని రసాస్వాదనచేశారు! అయినప్పటికీ ఉడుతాభక్తిగా సమర్పించే నాయీ 'కానుక'నుగూడా స్వీకరించాలి! నాగ్రంథం అనేకమంది హృదయాలకు కొంచెం కష్టంగలిగిస్తుందని నాకు తెలుసు! అందుకునన్ను క్షమించాలి!! నాలోవున్న లోపాలను మన్నించి, యేమైనా గ్రహింపదగినదివుంటే దాన్ని స్వీకరించ గలందులకు ప్రార్థిస్తున్నాను కొంత ధనసహాయంచేసిన "కొండూరుసోదరు"లకు నేను కృతజ్ఞుడను! మాగ్రంథమాలనుండి అనేకగ్రంథాలు యింకా వెలువడనున్నాయి. వాటినిగూడా ఆదరించి భాషాసేవకు సహాయం చేస్తారని ఆంధ్రపాఠకమహాశయులని ప్రార్థిస్తున్నాము! వెళ్లివస్తాను!! తిరిగి మరొక నెలరోజులలో మరొకపుస్తకంతో మిమ్మల్ని సందర్శిస్తాను!! నమస్తే!!!

ఇట్లు,

గ్రంథకర్త

Dr. ముదిగొండ మల్లికార్జునరావు
B. Sc., L. M. S. (Hom)

ఉపోద్ఘాతం!!

జ్యోతిర్మయ గ్రంథమాలవారి మొదటికిరణానికి ఉపోద్ఘాతం వ్రాసే సౌభాగ్యం నాకు లభించినందులకు నేను భగవంతుడికి ధన్యవాదా లర్పిస్తున్నాను!

ముదిగొండ మల్లికార్జునరావుగారు ఆంధ్రపాఠకలోకానికి కొంచెం క్రొత్తవారు. వీరువ్రాసినకథలు అపుడపుడు పత్రికలలో ప్రకటింపబడినయి. గుంటూరుతాలూకాలోని తాడికొండ వీరి స్వగ్రామం. వీరికి ఆంధ్ర, ఆంగ్లేయ, హింది, భాషలలో సమగ్రమైనసామర్థ్యమున్నది. ఉర్దూ, బెంగాలీ భాషలుగూడా కొంచెం తెలుసు! వీరువ్రాసిన అనేక నవలలు ధనాభావంచేత అముద్రితంగానే వుండిపోయినయి!

వీరువ్రాసిన "ఫ్యాషన్" అనే యీనవల, ప్రస్తుతం వెలువడుతున్న చౌకరకం రైల్వే వాఙ్మయంలాంటిదికాదు. అందరికీ సులభంగా తెలిసే వ్యావహారికభాషలో వ్రాసినప్పటికీ, భాషమాత్రం చాల రుచిగాను, చమక్కుగాను వున్నది. దీనినొక High class నవలయని చెప్పని కభ్యంతరంలేదు. దీనిలోని కథాసంఘటన, పాత్రౌచిత్యం, చరిత్రణ పాఠకలోకమే విమర్శించి తెలుసుకోవాలి!

కాగితం ధర రెట్టింపుగాపెరిగిపోయిన యీరోజులలో యీపుస్తకాన్ని యింత తక్కువవెలకు అమ్మడానికి సాహసించిన "గ్రంథమాల" వారు చాల ప్రశంసాపాత్రులు. వారి గ్రంథాలు ఆంధ్రదేశంలోని ప్రతివ్యక్తి చదివి గ్రహించడమే వారి ఆశయం! యింకా మున్ముందు అనేక గొప్పగొప్ప గ్రంథాలు వెలువడనున్నయి. వాటి నన్నిటిని ఆదరించి ఆంధ్రవాఙ్మయానికి తోడ్పడాలని పాఠకులను ప్రార్థిస్తున్నాను.

మొత్తంమీద "ఫ్యాషన్" ఆంధ్రనవలా ప్రపంచంలో ఒక వినూతన విఖ్యాత నవలయని చెప్పక తప్పదు. రచయితకు నాహృదయపూర్వకమైన వందనాలు!!

ఇట్లు

29-3-40

ఆకే. పాండురంగ

శ్రీ వేమన గ్రంథాలయం
శ్రీ అంగలూరు (కృష్ణా)

ఓం

ఫ్యాషన్!!!

"మీచేతిలోవున్న పుస్తక మేమిటండీ?" అని ప్రశ్నించింది సరోజని. ఆప్రశ్న వినడంతోటే మోహన్‌రావు కొంచెం ఖిన్నుడై నాడు. ఒక నిట్టూర్పువిడిచి "O! My God, ఇదినీకేంతెలుస్తుంది?... ... ఇది ఆస్కార్ వైల్డ్ వ్రాసిన ఒక మహత్తరగ్రంథం!" అని జవాబుచెప్పాడు, సరోజనిమౌనంగా వూరుకుంది. ఇదిఒకనాటిదృశ్యం!!!

మోహన్‌రావు బి. ఏ. బి. యల్. గుంటూరులోని సుప్రసిద్ధ వకీళ్ళలో ఒకరు. చాల సర్దాఅయినమనిషి. ఆధునిక పాశ్చాత్య వేష భాష లంటే చాల ప్రీతి. ఎప్పుడూ 'సూట్' తప్ప ధోవతి కట్టుకోడు. ధోవతి కట్టుకోవడం నాగరికత తెలియని మూఢులైన మన పూర్వులకు తగిపోయినది గాని మనకు తగదని ఆయన సిద్ధాంతం. ఎప్పుడూ అలంకారార్థం ఒక ఇంగ్లీషునవలో, నాటకమో, లేకపోతే కనీస మొక ఇంగ్లీషు జర్నలో పట్టుకొని తిరుగుతుంటాడు. ప్రాక్టీసు బాగా సాగుతున్నది; బాగా డబ్బు వొస్తున్నది. ఉదయం 7 గంటలకు నిద్రలేవడం, 10 గంటలకు కోర్టుకుపోవడం, కోర్టునుంచి 5 గంటలకు క్లబ్బుకుపోవడం క్లబ్‌నుంచి రాత్రి 8 గంటలకు యింటికిరావడం— యిదీ వీరి దైనికచర్య. యింట్లో అతనికి ఊసుబోవ్యేదికాదు. దానికి తగినకారణం లేకపోలేదు. తన ఆనందంలో, తన సర్దాలో, తన నాగరికతలో భాగం పంచుకోవలసిన తన భార్యకు "ఫ్యాషన్లు" తెలియకపోవడమే దీనికి కారణము.

మోహన్ రావుభార్య "సరోజని" మొదటినుంచి పల్లెటూళ్లోనే పెరిగింది. దివ్యమోహన విగ్రహం! చక్కని బంగారుచాయ దేహం! పెద్ద పెద్ద కళ్లు. షుమారు 18 సంవత్సరాలుంటాయి. అంతపొడుగూకాదు అంతపొట్టీకాదు, స్ఫురద్రూపియని నిర్భయంగా చెప్పవచ్చు! కాని ఆధునికవేషభాష లంతగా తెలియవు. తెలుగులో మాత్రం ప్రబంధాలుగూడ కొంచెం చదివి అర్థంచేసుకోగల జ్ఞానం వున్నది. సరోజనంటే మోహన్ రావుకుగూడ ప్రేమే! కాని, దానిలో ప్రేమకంటే జాలి యెక్కువని చెప్పవచ్చు. సరోజనివంటి జగదేకసుందరిని జూచి ప్రేమించనివారెవరుంటారు. అట్లాగే, మోహన్ రావుగూడా సరోజని శరీరసౌష్టవాన్ని జూచి ప్రేమించి, గౌరవించేవాడు. కాని, ఆధునాతన నాగరికతంటే తెలియని యువతి సర్వతోముఖంగా గౌరవనీయగాదు.

తాను క్లబ్బులో జూచే స్త్రీలకూ, సరోజనికీ యెంతభేదమున్నది? సౌందర్యంలో వారు యెక్కువగాకపోయినా జ్ఞానంలోనూ, సొగసులోనూ వారే యెక్కువ! సంఘనియమాలను యెంతచక్కగా విమర్శిస్తారు! ఆధునికసిద్ధాంతాల కెంతటి చక్కని వ్యాఖ్యచేస్తారు! మతముయొక్క వాస్తవికతత్వాన్ని యెంత సులభంగా విప్పిచెప్పగలుగుతారు! పెద్దపెద్ద ప్రొఫెసర్లకన్న మిన్నగా యింగ్లీషు మాట్లాడేవారెక్కడ! సరోజనియెక్కడ! ఎంతభేధముంది! వికసించిన పుష్పానికీ, మొగ్గకూవున్న వ్యత్యాసం ప్రౌఢకూ బాలకూగల తారతమ్యం!

షుమారు 8 గంటలయింది. గదిలోని బీరువాలనిండా పుస్తకాలున్నాయి. కొన్ని 'లా' పుస్తకాలు! కొన్ని ఇంగ్లీషునవలలు! కొన్ని ఇంగ్లీషుడ్రామాలు! అనిబిసెంటు వ్రాసిన భగవద్గీత, రాధాకృష్ణన్ గారు వ్రాసిన ఇంగ్లీషులోని ఉపనిషత్తువ్యాఖ్యలుకొన్ని, ప్రొఫెసర్ మాక్సుముల్లర్ గారువ్రాసిన "Sacred Books of the East" seriesలోనికొన్నిపుస్తకాలుగూడ వున్నయి. గాని వాటినెప్పుడు మోహనరావుచదివేవాడు గాకపోవడంచేత పుస్తకాలనిండా దుమ్ముపడివుంది. గోడలకు కొంతమంది ఇంగ్లీషుకవుల ఫొటోలు, ఇంగ్లీషుసినిమాతారల ఫోటోలు

వేలాడుతున్నాయి. గదిమధ్య నొక టేబిల్, దానిమీద నొక తెల్లని నగిషీగుడ్డ, ఓరంగా చుట్టూరా నాలుగు కుర్చీలున్నాయి. అందులో ఒక కుర్చీలో కూర్చొని సరోజని 'రామాయణం' చదువుకొంటున్నది. ఆగదిని చూడడంతోటే మోహన్‌రావుగారి "రీడింగ్ రూము" అని చెప్పకనే చెప్పుతున్నది. సరోజని చదువులో లీనమైపోయింది. అది శ్రీరాముని వనవాస ప్రయాణఘట్టం! శరీరం గగుర్పొడిచింది, కంఠం రుద్ధమైంది, కళ్ళ వెంబడి రెండు అశ్రుబిందువులు రాలేయి, ఎంతచక్కని కథాసంవిధానం! రాజ్యాభిషేకం జరుగుతుందని తయారవుతున్న రాముడు అరణ్యాలకు పోవాలసివచ్చింది! పరమేశ్వరుని లీలలను చిత్రించటానికి యింతకంటె నిదర్శనాలు కావాలా? చదివినపద్యాన్నే చదువుతున్నది. దుఃఖవిహ్వలయైపోతున్నది.

ఇంతలో హఠాత్తుగా మోహన్‌రావుగదిలోకి ప్రవేశించాడు. సరోజని కళ్ళనీళ్ళు తుడుచుకొని, చివుక్కున లేచి, పుస్తకం మూసివేసి, ప్రక్కనే తలకాయ వంచుకొని నిల్చుంది. తన అసూయికత్వానికి తానే ...ది. మోహన్‌రావు యీజీచైరులో కూర్చొని, చిరునవ్వుతో, సరోజని ముఖంవైపు చూస్తూ, "యివ్వాళ యేదో చాల serious (గంభీరం)గా చదువుతున్నట్లున్నావు, సరోజా?"

"ఏమిలేదండీ?"

"ఆఁ......నేనుచూచాను లేవోయ్, ఏదో తన్మయురాలవై చదువుతున్నావే?" అన్నాడు పకపకా నవ్వుతూ.

సరోజని సిగ్గుతో తలవంచుకొని, సమాధానానికి బదులో చిరునవ్వునుమాత్ర మిచ్చింది. ప్రేమవిహ్వలుడై మోహన్‌రావు "ఏదీ! ఆపుస్తకం యిల్లాచూపెట్టు" అన్నాడు.

సరోజిని పుస్తకాన్ని తీసుకొని గబగబ బయటికి పోవాలని ప్రయత్నించింది. కాని మోహన్‌రావు చేయి పట్టుకొని తనప్రక్కనే కుర్చీలో కూర్చోబెడుతూ "Modern days(నవనాగరికకాలం)లో కూడా అలా సిగ్గుపడుతారుటోయ్?" అన్నాడు చిరునవ్వుతో. ఆపుస్తకాన్ని

తీసుకొని "ఓహో, రామాయణమా?" అని ఒకనిట్టూర్పుతో పుస్త
కాన్ని తిరిగి యిచ్చివేశాడు.

"మీరువచ్చేవేళ యింకా కాలేదని చదువుకుంటున్నాను" అని
అన్నది సరోజ నిమ్మళంగా, ఏదో తప్పుజేసినదానిలాగా.

"O my dear mad girl, (ఓ నాప్రియమైన పిచ్చిదానా,) అందు
కోసరం కాదూ. నీకు చిక్కకచిక్కక యిల్లాంటిపుస్తకా లెక్కడిచిక్కా
యని!"

"ఏం! ఈపుస్తకాలు బాగుండవా!?"

"ఛీ ఛీ! ఇల్లాంటి పిచ్చిపుస్తకాలు చదివేకంటే అసలూరుకోన
డమే మంచిది"

"ఎందుచేత?"

"మనవాళ్లువ్రాసినపుస్తకాలన్నీ Immoral, obscene, Filthy
(చాల వ్యర్థమైనవి)"

"మీరుచెప్పిందేమిటో నాకేమీ తెలియలేదు. అర్థంచెప్పండి"

"Immoral అంటే Moralityకి వ్యతిరేకమన్నమాట"

"అంటే?"

"హాయ్ రే!! O woman, you are a stupid నీవుచాల మూర్ఖురా
లివి"

"అంటే??? "

"అంటె నాతలకాయ, తెలిసిందా? అంటే, అంటే,
అంటె నేనేంచెప్పేది? దానిని తెలుగులో ఏమంటారో నాకుతెలియదు.
అసలు తెలుగులో సరియైన 'వకబ్యులరీ' (శబ్దకోశము) యేలేదు. అందు
చేతనే తెలుగుభాష చదవవద్దని చెప్పడం"

"అయితే తెలుగుపుస్తకాలకంటె ఇంగ్లీషుపుస్తకాలు బాగుం
టాయంటారా?"

"తప్పకుండాను. మనవాళ్ళకు గ్రంథరచనంటే యేమిటో తెలి
యదు. ప్రస్తుతం పాశ్చాత్యదేశాలో Realism బాగా వ్యాపిస్తున్నది.

గ్రంథాలయం

సమాజంలో జరుగుతున్నదాన్ని ఉన్నట్లుగానే చిత్రించడం Realism- వల్ల లేనిపోని ఆదర్శాలు పులిమి మనవాళ్ళలాగా నవలను ఖరాబుచేయరు. నవలంటే Natural (స్వభావసిద్ధము) గా ఉండాలి. పుస్తకానికి ఉండాలసిన అన్నిలక్షణాలు ఇంగ్లీషురచనలలోనే చూడగలుగుతాము. Development of Character, ఆ పాత్ర మానసికతత్త్వ విచారణ, చూడాలంటే ఇంగ్లీషుపుస్తకాలే చదవాలి. మనవాళ్ళు వ్రాసిన పుస్తకాలు చదవడమంటే నాకు పరమ అసహ్యం. ఆపుస్తకాలనుఅంటుకొని hand Contaminate(చెయ్యి మయిలచేసుకోవటం) నాకిష్టం లేదు"

ఈమాటలన్నీ సరోజని నిశ్శబ్దంగా విన్నది. నిజంగా ఆమాటలలో అర్థమేమీలేదు. కాని ఏవనికీ అర్థాంగియై, ఎవని కష్టసుఖాలలో భాగం పంచుకుంటూ, ఎవనిమనస్సు నాహ్లాదపరచాలో అట్లాంటి ఉన్నతస్వభావుడైన భర్తకు ఎదురుచెప్పగలదా? సరోజని మనస్సులో చాలా ఖిన్నపడింది; తనభర్తను సుఖపెట్టలేకపోతున్నందుకు సిగ్గుపడింది. అల్లాంటి విద్యాధికుడైన భర్తకు తాననర్హురాలనని భావించింది. కొంచెం నిస్పృహతో తలవంచుకొని "నేను అల్లాంటి ఇంగ్లీషుపుస్తకాలు చదువుకొని ఆనందించే సౌభాగ్యం లేదుకదా, ఏంచేస్తాము? ఈ తెలుగుపుస్తకాలతోనే సంతృప్తిచెందాలి" అని అన్నది. మోహన్‌రావు ఆమాటలువిని చాల జాలిపడ్డాడు. "లేదు సరోజా! అట్లనకు! కొంచెంకష్టపడి పరిశ్రమచేస్తే కొద్దికాలంలోనే ఇంగ్లీషుభాషలో సమగ్రమైన జ్ఞానము కలుగజేసుకోగలవు. రోజుకొక రెండుగంటలు నేను Spare చేయగలను. నీవు ఇంగ్లీషు నేర్చుకుంటే నామనస్సుకెంతో సంతోషంగా ఉంటుంది" అని మోహనరావన్నాడు.

సరోజనిహృదయంలో కొంచెం ఉత్సాహం కలిగింది. భర్త మనస్సు నాహ్లాదపరిచే మార్గమొకటి చిక్కినందులకు సంతోషించింది. తన సర్వస్వాన్ని అర్పించి భర్తను సుఖపెట్టాలనుకొనే పతివ్రత భర్తకోర్కెలను త్రోసివేయగలదా?? నిజంగా తాను ఇంగ్లీషుచదువుకోవడం

భర్తను ఆనందాన్నికలిగించే యెడల తాను రోజుకు రెండుగంటలుగాక తన తీరికకాలమంతా చదువుకే వినియోగిస్తుంది. భారతనారి భర్తకో సరం ఏంచేయటానికి సంసిద్ధపడదు!!!

"మీరుచెప్పేటట్లయితే నేను తప్పకుండా నేర్చుకుంటాను" అని చాల ఉత్సాహంతోటి అన్నది సరోజని. వెంటనేమోహన్‌రావు లేచి సరోజనిని దగ్గరకుతీసుకొని ముద్దుపెట్టుకొని ప్రియురాలి ఆకర్ణాంత విశాలనయనాలలోకి స్నేహావిహ్వలమైన దృష్టితో చూస్తూ చిరునవ్వుతో "అయితే ఇవ్వాళే ప్రారంభిద్దాము" అనిఅన్నాడు.

౨

సరోజని ఇప్పుడు ఇంగ్లీషునవలలను చదివి బాగాఅర్థంచేసుకుంటున్నది. ఎప్పుడూ ఏదో ఇంగ్లీషుపుస్తకం చదువుతునేవుంటుంది. భర్తతోటి తరుచు ఇంగ్లీషులోనే మాట్లాడుతుంటుంది. అత్తగారితోమాట్లాడేట ప్పుడుగూడా అప్పుడప్పుడు ఇంగ్లీషుమాటలు దొర్లుతుండేవి. ఈవేష మంతా అత్తగారి కేమీ నచ్చేదికాదు. అప్పుడప్పుడూ అత్తాకోడండ్రకు కొంచెంఘర్షణజరుగుతుండేది. ఒకానొకప్పుడు అత్తగారు వినిపోతుం దేమోనని బిగ్గరగా మాట్లాడ్డానికి భయపడే సరోజిని ఇప్పుడు అత్తగారి తో వాగ్వివాదానికికూడా సంసిద్ధపడుతున్నది. మోహన్‌రావు రెండు జతల స్లిప్పర్లు, కొన్ని గౌనులు, కళ్ళజోడు, ఫ్యాషనబుల్ చీరెలు, చక్కని జాకెట్లు, పోమేడ్సు, బర్మాశాండిల్సు, రిష్టువాచి, మొదలైన ఆధునికయువతికి కావలసిన పరికరాలన్ని కొనుక్కొచ్చాడు. ఇంగ్లీషును బోధించుటతో పాటు 'పర్‌ఫ్యూమ్సు' ఉపయోగంకూడబోధించాడు. కాని సరోజినికి ఈవేషాలన్నీ వేయటం కొంచెం సిగ్గుగానుండేది. ఎంతమార్చు కుందామన్నా పూర్వపు వాసన మారనిచ్చేదికాదు. అందుకోసరం రాత్రి ళ్లుమాత్రం భర్తకోసరం ఈవేషమంత వేసుకుండేది! మోహనరావుకు, ఇప్పుడు సరోజనిమీదప్రేమ ద్విగుణీకృతమైంది. రాత్రి రెండుగంటల

దాకా ఏవో నవలలనుగూర్చి, నాటకాలనుగూర్చి చర్చలు జరుగుతుండేవి. సమాజంలోని లోటుపాట్లన్నీ సరోజిని బాగా గుర్తించగలిగింది. మోహన్‌రావు ధన్యుడైనాడు.

ఒకరోజు ఉదయం 9 గంటలకు సరోజిని రీడింగ్‌రూములో కూర్చుని ఏదో ఇంగ్లీషునవల చదువుతూవున్నది. ఇంతలోనే దాసీవచ్చి 'అత్తయ్యగారు పిలుస్తున్నారు' అని చెప్పి వెళ్లింది. అయిదునిమిషాలయ్యాక "సరోజినీ! సరోజినీ" అని అత్తగారు కేకవేసింది. కాని నిర్లక్ష్యంగా, వినిపించనట్లుగా కూర్చున్నది సరోజిని. తరువాత 'ఓయమ్మాయి సరోజినీ' అని మరోపిలుపు పిలిచింది. కాని సరోజిని పుస్తకాన్నిచదువుతూ అల్లాగే కూర్చున్నది. అత్తగారికి చాల కోపంవచ్చింది. ఇక కోపం ఆపుకోలేక గబగబా మెట్లెక్కి పైకొచ్చింది. కుర్చీలోకూర్చుని నవలచదువుకుంటున్న సరోజినిని చూచి "పిలుస్తున్న పిలుపులు వినిపిస్తున్నాయిగావే? ఇందాకటినుంచి కేకలువేస్తూ తలకాయ బద్దలుకొట్టుకుంటున్నా రావేమిటే?" అని ప్రశ్నించింది.

"నాకిప్పుడు తీరికలేదమ్మా........" అని సరోజిని జవాబుచెప్పింది.

క్రోధంతో "అకటా! ఇదేమైనా భోగంకొంపనుకుంటున్నావా? మే మింతవఱకూ ఏదో ప్రతిష్ఠగా బ్రతికాము. గంటసేపటినుంచి నేను పిలిచిన పిలుపులు వినిపించాయికాదా? చెవుల్లో ఏమైనా చెట్లు మొలిచాయా? మారోజుల్లో ఇలా పుస్తకాలు చేతుల్లోపట్టుకొని విచ్చలవిడిగా తిరిగామా? పనిలేని తీరికవేళ ఏదో రహస్యంగా చదువుకోవటం సహజం, కాని ముసలిముండను పనిచేయలేక చచ్చిపోతుంటే ఉత్సాహంగా పుస్తకాన్నిపట్టుకొని తూరుపారులుచెయ్యటం నేనెక్కడా చూడలా. అయినా నీకేంలే! మహారాణివి. మొగుడు సంపాదించుకొస్తున్నాడు నీవెందుకు పనిచేయాలి? ఈ ముసలిముండ చస్తేనేం, బ్రతికితేనేం, మీకెందుకు? ముందొచ్చిన చెవులకంటె వెనుకవచ్చినకొమ్ములు వాడి మన్నాయిట. చిన్నప్పటినుండి కష్టసుఖాలకోర్చి కడుపు వాకిట్లోనా

పిల్లలనుపెట్టి, పిల్లవాడికష్టసుఖాలె తమకష్టసుఖాలని భావించి, పెంచి
పెద్దవానిని చేశాక ఇవ్వాళ అధికారం చలాయించటానికొస్తారు అమ్మ
గార్లు. ఈయింట్లో నేనుబ్రతికిఉన్నంతవరకు నాఅధికారం చెల్లవలసిందే.
నామొగుడు సంపాదించుకొస్తున్నాడుగదా యని అనుకోకు. నీకుమొగు
డైతే నాకు కొడుకే! ఆమాత్రం నాకూ సంబంధముంది. ఇంతనిర్లక్ష్య
మా? పెద్దముండనుచూస్తే కొంచెమయిన భయము, భక్తి ఉండక్క
ర్లేదూ? ఇంతెసి నిన్ననలసిందేముంది? కాతుమెత్తనైతే గుఱ్ఱం
మూడుకాళ్ళ నడుస్తుందిట. వాడికి జ్ఞానముంటె ఇంత అదుపూ, ఆజ్ఞ
లేకపోవటం ఎందుకు తటస్థిస్తుంది" అని గబగబా జడివానలాగా ఉప
న్యాసమిచ్చి క్రిందికదిగిపోయింది. ప్రక్కగదిలో మోహనరావుకూర్చొని
ఇదంతా వింటూనేఉన్నాడు. కాని నోరు మెదల్పలేదు. సరోజినీమౌనం
గా అత్తగారన్నమాటలన్నీ విన్నది. అందులోని ప్రతిమాట వాస్తవమే
నని తన హృదయం జవాబుచెప్పింది. తనగర్వం తనకే కొంచెం అసహ్య
మనిపించింది. పుస్తకం మూసివేసి నిద్రపోయింది.

ప్రొద్దుగూకింది. 8 గంటలకు సక్రమంగా అంతా భోజ
నంచేశారు. సరోజినికూడ భోంచేసి మేడమీదికి పోయింది. ఎలెక్ట్రిక్
లైటు వెలిగించి పరుపును పరిచింది. తెల్లని గలీబుగుడ్డను
దులిపి దానిమీద వేసింది. తమలపాకుబీడీలుచుట్టి భర్తకోసరం ప్రతీ
క్షిస్తూ నిలుచుంది. కాని భర్తగారు ఎవరో పార్టీలతోటి అర్జంటయిన
వ్యవహారవిషయాలని మాట్లాడుతూ క్రింద ఆఫీసుగదిలో ఉండడంచేత
తాను గ్రామఫోనుప్లేట్లు పెట్టి కుర్చీలో కూర్చుంది. కాని ప్రొద్దుటివిష
యాలన్నిమాత్రం హృదయాకాశాన్నుంచి తొలగిపోవటంలేదు. దేవి
కారాణి మృదుమధురగానాన్ని వింటూ కుర్చీలో అల్లాగేకూర్చుంది.
ఇంతలోనే భర్తవచ్చాడు. తలుపుగడియవేసి ఇరువురు చెరి ఒకకుర్చీ
లో కూర్చున్నారు.

సరోజిని తాను తమలపాకులు వేసుకొంటూ, భర్తకు
ఒక్కొక్కఆకే అందిస్తున్నది "ప్రొద్దునజరిగినగడబిడంతా నేనువింటూ

నేయున్నాను" అన్నాడు భర్త. సరోజిని మౌనంగావూరుకుంది.

"సరోజా, అనవసరంగా ఆమెహృదయం నీవెందుకు దుఃఖ పెట్టావు? నాకు చాల కష్టమయింది. ఆమె అనే మాటలు చాల కఠో రంగా నాహృదయానికి నాటుకొన్నాయి. మనం సౌఖ్యంగావుండడం నాకెంతయిష్టమో, ఆమెమనస్సు సంతోషంగావుండడంగూడా నాకంతయి ష్టము. నాకేగాదు, నీకుగూడా అల్లాగే వుండాలి, అంతే సౌకర్యం" అని అన్నాడు మోహన్‌రావు.

"నిజంగా అల్లాగే అనిపిస్తోంది. నేటినుంచి నాఇంగ్లీషువిద్యా భ్యాసం మానివేస్తాను" అని సరోజిని అన్నది.

ఇప్పుడు చాల కష్టపరిస్థితుల్లోపడ్డాడు మోహన్‌రావు. తల్లిని తిరస్కరించి ఇంగ్లీషునేర్పడమా, లేక, ఇంగ్లీషునేర్పకుండా తన సౌఖ్యాన్ని వదలుకోవడమా? రెండునిమిషాలు ఆలోచించాడు. బి. ఎ. బి. యల్ ప్యాసయిన మోహన్‌రావువంటి విద్యాధికునకు ఆలోచనలకు కొదువా? చక్కని ఉపాయం స్ఫురించింది.

"అల్లాగయితే, సరోజా, ఈవూళ్లో అమ్మగారిదగ్గిరవున్నంత వరకు మనకు స్వేచ్ఛవుండదు. ఇక్కడ ప్రాక్టీసు బాగా సాగడంలేదని వంకబెట్టి మదాసువెళ్దాము. అక్కడ మన సౌఖ్యంలో అడ్డుపడేవారెవ రూ వుండరు. అక్కడ స్వేచ్ఛగా ప్రేమాకాశంలో విహరింపవచ్చు. పగలువూట కండ్లజోడు పెట్టుకోకుండా, బూట్లువేసుకోకుండా నీవెంత కాలం కష్టబడుతావు? అమ్మగారితో నేను మాట్లాడి మనం మద్రాసు వెళ్లే ప్రయత్నం చేస్తాను".

3

మద్రాసు మైలాపూరులో ఒకమేడను అద్దెకు తీసుకున్నారు. దానికిఅద్దె 125 రూపాయలు. రెండుహాలులు, Bed room, ఒకరీడిం

గురూము, ఒక డ్రెసింగురూము, ఒక బేతింగురూము, ఒక వంటయిల్లు (కిచన్) వెనుకవైపు ఒకదొడ్డి. మేడమటుకు చాల అందముగాను వసతిగాను ఉంటుంది. ఇద్దర్ని పనిమనుష్యులను ఏర్పరుచుకున్నారు. స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకోవచ్చు. జమాఖర్చు అడిగేవా రెవరూలేరు. కావలసినంతమంది మిత్రులు, అనేకక్లబ్బులు, సాయంత్రపుపూట షికారుకు బీచి, మద్రాసులో నవనాగరికులకు కావలసిన లక్షణాలన్నీ ఉన్నవి. ఖర్చుపెట్టడానికి డబ్బాడున్నది. ఇంకేంకావాలి? ఆనందమయజీవితం ఉచ్ఛృంఖలంగా విహారింపవచ్చు.

మద్రాసువచ్చిన మొదటిరోజునుంచి 'Table meal' బల్లమీద అన్నంతినడం యేర్పాటుచేశాడు మోహన్‌రావు. మొదట కొన్నాళ్ళ వరకు సరోజని ఆవిధంగా తిండానికి చాల సిగ్గుపడేది కాని తరువాత అలవాటయిపోయింది. మోహనరావు సరోజనిని "డియర్" "డార్లింగ్" అనిపిలుస్తుండేవాడు.

మద్రాసువచ్చి సంవత్సరం గడిచిపోయింది. ప్రతిరోజు భార్యాభర్తలిరువురు క్లబ్‌కు పోయేవారు. ఒక్కొక్కరోజు బీచికిపోయేవారు. వారానికి మూడుసార్లు థియేటరుకు పోతుండేవాళ్లు. పొరుగింటికి పోవటానికికూడా సరోజిని జట్కాయెక్కిపోయేది. అదేఫ్యాషన్ అని, కాలినడకనడిస్తే Dignity కిలోపంగా ఉంటుందని మోహన్‌రావు అంటుండేవాడు. ఎప్పుడూ మోహన్‌రావుగారియిల్లు స్నేహితబృందము కళకళ్లాడుతూంటుంది సరోజని మొదటమొదటవారియెదటికిరావటానికిసిగ్గుపడేది కాని మోహన్‌రావుకు సుతరాం ఇష్టముండేదికాదు తనస్నేహితులదగ్గరకు రావడానికే సిగ్గుపడితే వాళ్లు తనభార్యను Uncultured అని అనుకుంటారేమోనని మోహన్‌రావు భయపడేవాడు. తనభార్య ఎంతసౌందర్యశాలో తన మిత్రబృందానికి చూపెట్టాలంటు అతనికచాల సరద ఏదోఒకనెపాన దగ్గరకుపిలుస్తుండేవాడు కాని సరోజినిసిగ్గుపడి అవసరమున్నంతవరకే వారి ఎదుటకు పోతుండేది, కాని భర్త అది సివిలిజేషన్(నాగరికత)యొక్క లక్షణముగాదని, up to date (ఆధునిక) స్త్రీ

లెవరు అలా సిగ్గుపడరని. నీవు అలా సిగ్గుపడుతుంటె అనాగరికురాలవని అనుకుంటారని బాగా బోధించుటచేత కట్టుకడకు సరోజినికూడ వారిస్నే హితుల సంభాషణలో పాల్గొనుట ప్రారంభించింది. ప్రతిరోజు భర్త తోటిపాటు క్లబ్‌కి పోయేది. క్లబ్‌కు అనేకమంది స్త్రీలుగూడ వచ్చేనా రు. వారివేషంలో, వారి మాటలో, వారిప్రతి అడుగులోనూ పాశ్చా త్య అనుకరణ ప్రతిబింబిస్తుండేది. హాస్యాస్పదమైన ఆ అనుకరణ మొట్టమొదట సరోజినికి నచ్చలేదు. క్లబ్బులోనికి వచ్చే స్త్రీపురుషులంతా కలసి టెన్నీస్ ఆడేవారు కాని, వారి ప్రతిఅడుగులో ను, పరుగెత్తటంలోనూ, నిల్చోడంలోనూ, ఫ్యాషన్ తొణికిసలాడుతుం డేది. వారు వ్యాయామంకోసరం ఆడేవారుకాదు. ప్రదర్శనకోసరం, నటనకోసరం, ఫ్యాషన్‌కోసరం, ఊరకగా బ్యాట్లను త్రిప్పుకొంటూ ఆడే వారు. వారి వేషభాషలు, వారి చలాకీ, ఉత్సాహం, చూచి సరోజిని ఆశ్చర్యపడేది. వారు దేవలోకంనుంచి వచ్చినఅప్సరసల్లా అనిపించేది. వారు మొగవారికంటె మిన్నగా టెన్నీసు ఆడుతుంటే సరోజిని ఆశ్చ ర్యపోయ్యేది. ఇంతసమర్థత వీరికెక్కడనుంచివచ్చింది? వారిముందు తానొక మట్టిబొమ్మవంటిదాన ననుకొనేది. కాని నిజంగా సరోజినిసౌం దర్యము క్లబ్‌లోని వనితలకే సవాలుచేసింది. మిస్ రోజ్, శ్రీమతి నాయుడు (అంటేనాయుడుగారిభార్య. ఇది ఇంగ్లీషు వారిపద్ధతి ఉదా:- భర్తపేరుమిస్టర్ జంకిన్సుఅయితే భార్యపేరు మిసెస్ జంకిన్సు అనిఉంటుం ది. ఆలాగే భర్తగారునాయుడైతే భార్యపేరు శ్రీమతినాయుడైతుంది) మిసెస్ హుడ్, మిస్ సుశీల మొదలైనవారు చాల స్నేహితమైనారు. వీరంతా ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడేవారు. కొంతమంది పురుషులతో గూడ పరిచయమయింది వారిలో Mr. రెడ్డి, Mr. రావుజీ. Mr.దుర్గా ప్రసాద్, మొదలైనవారు ముఖ్యులు. వీరు సరోజినిసౌందర్యాన్ని ఎప్పుడు ప్రశంశిస్తుండేవారు. క్రమక్రమంగా సరోజినికికూడ ఆప్రశంశల ను వింటుంటే చాల ఆనందముకలిగేది. రోజురోజుకు క్రొత్త క్రొత్త పోకలు చేసుకోవటం ప్రారంభించింది. క్లబ్‌లోని అందరివృష్టులను

ఆకర్షించడమే ఆమె ఆదర్శమైంది. బజారున వచ్చేటప్పుడు నవయువకు లు పేర్లిమోగ్గెత్తిలో తనవైపు చూడడం గాంచి ఆమె ఉబ్బిపొ య్యేది. అపారఆనందాన్ని అనుభవించేది. రోజు రోజుకు క్రొత్త క్రొత్త ఫ్యాషన్లు, క్రొత్తక్రొత్త నడకలు, చమత్కారయుక్తమైన సంభాష ణలు నేర్చుకుండేది. నేను తానుకూడ క్లబ్‌లోని నాగరికస్త్రీలలో ఒకర్తెగా మారింది. క్లబ్‌కుపోయేవేళఎప్పుడౌతుందాఅని గడియారంవై పు చూస్తుండేది. వేళయిన వెంటనె భర్తతోపాటు క్లబ్‌కుపోయేది. Mr. రెడ్డి వగైరాలుగూడ అప్పుడప్పుడు మోహన్ రావుగారింటికి వస్తుం డేవాళ్లు. అనేక విషయాలను, అనేక సమస్యలనుగూర్చి చర్చలుజరుగు తుండేది. కొంతసేపు గుఱ్ఱపుపందేలనుగురించి, కొంతసేపు నవలలను, పత్రికలను గురించి, కొంతసేపు సినిమాలు, టెన్నిస్ పోటీలనుగురించి విమర్శనలు జరుగుతుండేవి. మోహన్ రావు కోర్టుకు వెళ్లకపూడ అప్పు డప్పుడు రెడ్డి వస్తుండేవాడు, కాని సరోజిని వారినిచూచి సిగ్గుపడేదికా దు. చాల Mannerly (మర్యాదగా) అహ్వానించేది. చాలసేపు కబు ర్లు చెప్పుకుండేవారు.

౪

సాయంత్రం ఆరుగంటలయింది.

"సరోజనీ........."

"........."

"సరోజనీ"

"ఆ...ఆ......" అని సరోజినివచ్చి తలుపుతీసింది. Mr. రెడ్డి, Mr. దుర్గాప్రసాద్ వాకిట్లో నుంచోనున్నారు. సరోజని 'Hallow, (హల్లో) అని షేక్‌హాండ్ ఇచ్చి వారిని లోపలికి తీసుకొనివచ్చింది. ముగ్గురు కుర్చీలలోకూర్చున్నారు. 'మోహన్‌రావు కోర్టునుంచివాలేదా' అని Mr. రెడ్డి ప్రశ్నించాడు. 'Not yet' (ఇంకారాలేదు) అని సరోజని జవాబిచ్చింది. ఇంతలో నొక బిచ్చగాడు

దేవునిమహిమ తెలియగవశమా పాపులకీ యిలలో
కన్నులు తెరచి, గర్వమువిడచి కాంచనచేలుగ గనరా జీవా
॥దేవు॥

అని దివ్యమైన కంఠంతో గానంచేస్తూ గుమ్మందగ్గరకొచ్చాడు. ఆగానాన్ని వింటూ అమ్ముగ్గురు చకితులై కూర్చున్నారు. పాటంతా అయిపోయినతరువాత Mr రెడ్డి పకపకనవ్వి "ఎక్కడచూసినా ఈసిని మాకీర్తనలే వినిపిస్తుంటాయి" అని అన్నాడు.

సరోజిని "అన్నట్లు మరచిపోయాను 'ఆద్మీ' చూచారా! చాల బాగుందని విన్నాను!" అని అన్నది.

"ఆ...ఆ... మొన్నరాత్రి వెళ్ళాము, మీరుకూడా వస్తారేమోనని ఇక్కడకొచ్చాం. మీరు క్లబ్ కు వెళ్ళియుండటంచేత నిరాశ చెంది వెళ్ళిపోయాము. కాని చాల అద్భుతమైనఫిలింలెండి. శాంతారాం వంటి ప్రతిభాశాలి చేతులలో మెలిత్రిప్పబడిన ఫిలిము సుప్రసిద్ధమైన దంటే ఆశ్చర్యమేముంది! వారు మన తెలుగు సెట్టిలాంటివారు కారు. ART(కళ) కోసరం ఎంతడబ్బైనా వెచ్చించి చిత్రానికి సగిషీలు దిద్దే కళావేత్తలు వారు. కూలిడబ్బుల కాశపడి మూడునెలల్లో పదివేల రూపాయలతో ఫిలింతీసి నాలుకవెళ్ళబెట్టేవారుమన తెలుగువారు. నిజంగా మన తెలుగుఫిలిములు వాటితో సరితూగటానికి కొన్ని శతాబ్దాలు తీసుకుంటుంది" అని రెడ్డి అన్నాడు.

"అమ్మా!... బిచ్చంపెట్టండి. నిన్నటినుంచి ఒకమెతుకైనా తిన్నానుకాను. తల్లీ! పుణ్యముంటుంది. ఒక్కకబళం వేయించండి" అని బిచ్చగాడు కేకవేశాడు. కాని ఆభేదవానిరోదనం మన నవనాగరికులను కదిలించలేకపోయింది. సరోజిని "అల్లా అనాకండి. సి. పుల్లయ్యగారు, H. M. రెడ్డిగారువంటి సుప్రసిద్ధ కళోపాసకులు, మన తెలుగులోకూడా ఉన్నారు" అని అన్నది.

"ఆ......ఆ...... లంకాదహనం, సులోచన, ఉషాపరిణయంలాంటి టాకీలుగూడ తెలుగులో యున్నవి." అని దుర్గాప్రసాద్ చిరునవ్వుతో అన్నాడు.

బిచ్చగాడు దీనస్వరంతో మరల 'అమ్మా! ఒకకబళంవేయించండి. వెళ్లిపోతాను" అని కేకవేశాడు. కాని మానవహృదయాలను కంపింపచేసే ఆ నిర్భాగ్యజీవి అర్తనాదము మనమిత్రులచెవుల నందుకొన్నదిగాని మనస్సు నందుకోలేకపోయింది. బీదవాని కేకలు ఎవరికిలక్ష్యముంటాయి ? తిరిగి మనమిత్రులు వారిసంభాషణలో లీనమైనారు.

"కాని మన తెలుగులో పౌరాణికఫిలిము లంతమొంది సాంఘికచిత్రాలువస్తే బాగుంటుంది. సంఘానికి, దేశానికి కొంత ఉపయుక్తంగా ఉంటుంది" అని రెడ్డి అన్నాడు.

"ఔనౌను. మద్రాసుబాలెట్ లో వందేమాతరానికి ప్రథమ బహుమాన మిచ్చారుట" అనిఅన్నది సరోజిని.

"ఇప్పుడొచ్చిన సాంఘికచిత్రా లన్నిటిలోకి 'మళ్లీపెళ్లి' బాగుందని దుర్గాప్రసాదన్నాడు.

"నిజంగా మళ్లీపెళ్లిలో కాంచనమాల చాలబాగా యాక్టు చేసింది. అంత tremendous (అద్భుతంగా) మరేఫిలింలోను ఆవిడ యాక్టుచేయలేదనుకుంటాను." అని రెడ్డి అన్నాడు.

"అమ్మా! ఇందాకటినుంచీ కేకలేస్తున్నాను. ఒక్క కబళం వేయించండి, పోతాను." అని ఆ దౌర్భాగ్యజీవి తిరిగి కేకవేశాడు.

"పోరా........పోరా........మరో ఇంటికి పో" అని సరోజని అన్నది.

"అమ్మా ! ఆకలితో మాడిపోతున్నాను. ఒక్క ముద్దవేయండి" అని బిచ్చగాడన్నాడు.

"నీకుకాదా చెప్పేది? తీరికలేదు...పో. మరో ఇంటికివెళ్లు" అని సరోజని కొంచెం కోపంతో అన్నది.

"అమ్మా ! దీనికింతసేపటినుండి నిలవబెట్టాలా?... అప్పుడే చెప్పితే వెళ్ళిపోకపొయ్యానా?" అని బిచ్చగాడు దీనంగా అన్నాడు.

" నోరు ముయ్యరా! ...... గాడిదముండాకొడకా ... వెళ్ళిపొమ్మంటే పోరాదు? 'పానకంలో పుడకలాగు' పెద్దలార్థులాగా వచ్చావు. చెప్పుతీసుకొని కొడతాను వెధవ" అని రౌద్రమూర్తియై రెడ్డి లేచినిలుచున్నాడు. బిచ్చగాడు భయపడ్డాడు. కాని బీదతనం వచ్చినంత మాత్రాన ఒకభారతీయునిలో ఆత్మాభిమానం చచ్చిపోదు. కూటికి లేక మలమలమాడే తనదైన్యత వారిహృదయాల్ని కలచివేయకపోవటం మళ్లాండగా తిట్టడంగూడానా! తానంత లోకువయ్యాడా ! బీదతనం ఉన్నంతమాత్రాన ఆత్మగౌరవాభి కాంక్ష పోయిందను కొన్నారు కాబోలు. ఎందరి బీదలరక్తాన్ని పీలిస్తే ఈ భాగ్యవంతులు ఈవిధంగా విర్రవీగుతున్నారో వారికి తెలియదు ? ఒకప్పుడు కాకపోయిన మరొకప్పుడైనా వారి అంతరాత్మ ప్రబోధించదు? బిచ్చగాడి హృదయం ఆవేదంతో పరితప్తమైపోయింది. నఖశిఖపర్యంతము జ్వలితమైంది. చేయటానికి నౌకరీచిక్కక, సంవత్సరానికి ఏనెలరోజులో పని చిక్కినా రోజుకు మూడణాలుమాత్రమే గిట్టుబాటయి, కూటికిలేక మలమలమాడుతూ చంటిపిల్లలు ఆకలిబాధ కోర్వలేక హృదయవిదారకంగా ఏడ్చే ఏడుపు

వినజాలక అడుక్కోటానికి రావటంగూడ తప్పేనా? 'తప్పుకాదు నీకు హక్కుంది' అని వాని హృదయం జవాబిచ్చింది. తప్పుకానపుడు తన్ను వారెందుకు తిట్టాలి? తానేంఘోరంచేశాడు? బిచ్చంవేయమన్నాడు. ఇష్టంలేకపోతే పొమ్మనాలి. అంతేకాని తిట్టటమెందుకు? బిచ్చగాని ఆత్మాభిమానం వానిని మౌనంగా ఊరుకోనివ్వలేదు.

"స్వామీ!......మీకిష్టంలేకపోతే వెళ్లిపొమ్మనాలి గాని అట్లా తిట్టటమెందుకు? మాకుగూడ హృదయం ఉందా? ఆవిధంగా తిట్టితే మీకెట్లావుంటుందో నాకుమాత్రం అల్లాగే కష్టంగాఉండదు?" అని నిష్కళంగా అర్జీ పెట్టుకున్నాడు.

కాని ఒక నిర్భాగ్యుని దీనవచనాలను వినేవారెవరు? అసమర్థుడు మంచిమాటన్నా చెడుగానే మన చెవులకు వినిపిస్తుంది. ఈమాటలు శెట్టిగారికి కర్ణకఠోరంగా వినిపించాయి. ఉగ్రుడైనాడు. గబగబా వచ్చి కాలి బూటు తీసి 'ఫడేల్ ఫడేల్' మని బిచ్చగాడి ముఖంమీద నాలుగుదెబ్బలు కొట్టాడు. అన్నపుతప్పేల క్రింద పడిపోయింది. బిచ్చగాడి ముక్కువెంబడి నెత్తురుకారటం ప్రారంభించింది. కాని ఏంచేస్తాడా దరిద్రజీవి? 'పేదవాని కోపం పెదవుల చేటన్నట్లు' ఆదరిద్రుడు, కూటికిలేక మాడే అనిర్భాగ్యుడు, భాగ్యవంతులతోటి మాట్లాడటం తప్పుగదూ? బీదలమీద అధికారం చెలాయించటానికే భగవంతుడు వానిని సృష్టించాడు. ఇంత స్థూలమైన ప్రకృతిధర్మాన్ని తెలిసికోనలేక పోయిన ఆ అమాయక బిచ్చగాడు దెబ్బలుతింటంలో ఆశ్చర్యమేముంది? వాని ముక్కునుంచి రెండు మూడు రక్తబిందువులు నేలమీద పడ్డాయి. తమచెమటను భాగ్యవంతులకోసరం ధారపోసే దరిద్రులు తమ రక్తాన్నిమాత్రం ధారపోయనక్కరలేదు? బిచ్చగాడు క్రిందపడిపోయిన అన్నాన్నంతా తప్పేలలో కెత్తుకోని ఏడుస్తూ వెళ్లిపోయాడు.

ఎంత హృదయవిదారకమైన దృశ్యం! అబ్బా! నిజమైన మానవహృదయాలు కంపించవు! ఈదృశ్యం చూచికాని మన నవనాగరికుల హృదయాలవరకూ ఆజ్వాల పోలేకపోయింది.

ముగ్గురూ 'పకపక' నవ్వుతున్నారు.

౫

ఇద్దరూ కుర్చీలలో కూర్చున్నారు. సాయంత్రం 6 గంటలయింది. ఎలక్ట్రిక్ లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. చల్లని గాలి నిమ్మళంగా వీస్తున్నది. యిద్దరూ ఏదో ఆనందంగా కబుర్లు చెప్పుకొంటున్నారు. Mr. రెడ్డి తన రెండుచేతులతోటీ సరోజనిచేయి పట్టుకొని చూస్తున్నాడు. చేతిని అటూ యిటు త్రిప్పి కొంచెం గిచ్చాడు. సరోజని పకపకా నవ్వింది. రెడ్డికూడ నవ్వాడు. తిరిగి చెయ్యి పట్టుకోబోయినాడు. కాని "ఆవిధంగా గిచ్చి నన్ను బాధిస్తే నేను చెయ్యిచూపించుకోను" అని సరోజని కోపం నటిస్తూ అన్నది.

"అట్టే...... ఆమాత్రం ఓర్చుకోలేకపోతే యెట్లా?" అని రెడ్డి అన్నాడు, యిరువురూ పకపక నవ్వారు.

ఇంతలోనే మోహన్‌రావు కోర్టునుంచి వచ్చాడు. ఆదృశ్యం చూచాడు. రెడ్డి సరోజనిచెయ్యి పట్టుకొని వున్నాడు. యిరువురూ పకపక నవ్వుతున్నారు. మోహన్‌రావు చకితుడైనాడు. ఎక్కడనుంచో తుపాకిగుండువచ్చి గుండెలలో తగిలినట్లయింది. కాస్త తడబడుకుంటూ లోపలికివెళ్లి కోటువిప్పి గోడకు తగిలించాడు. భర్తను చూచికూడా సరోజని కుర్చీలోనుండి లేవలేదు. అల్లాగే పకపకా నవ్వుతూనే "ఏమం

డోయ్ ......చూచారా? రెడ్డిగారు Palmistry (సాముద్రికము) చూస్తున్నారు...... మీరుగూడా. చూపించుకోండి!" అని అన్నది. మోహన్‌రావు వినీ వినిపించుకోకుండా "అల్లాగా......" అన్నాడు ఉదాసీనతతో.

"నాకు ఒక కుమారుడు పుట్టుతాడని రెడ్డిగారంటున్నారు" అని సరోజని అన్నది. మోహన్‌రావు ఉదాసీనతగా "అల్లాగా..." అని వూరుకొన్నాడు. "నేను Birth control (సంతాననిరోధకం) చేస్తానని చెప్పుతున్నాను" అని సరోజని నవ్వుతూ అన్నది.

"ఒకవేళ పుట్టితే? ......" అని ప్రశ్నించాడు రెడ్డి; కొంచెం పంతంగా.

"పిల్లలిని కని శరీరసౌష్టవాన్ని నాశనంచేసుకోవడం నాకిష్టం లేదు. ఆడదంటే పిల్లల్నికనే Machine (యంత్రము) కాదని నాఅభిప్రాయము. పిల్లల్నికనడం ప్రారంభిస్తే నాలుగుసంవత్సరాలలో ముసలితొత్తులా తయారుకావలసిందే! Beauty is a gift given by God (సౌందర్యం భగవంతుడిచ్చిన వరము) దానిని అంత సులభంగా పోగొట్టుకోవడం నాకిష్టంలేదు." అని సరోజిని అన్నది.

"అపుత్రస్య గతిర్నాస్తి" అంటారుగాబోలు మనపెద్దలు?" అని రెడ్డిగారు వికటంగా, హేళనగా నవ్వాడు. అడవిమనుష్యులైన మన పెద్దవాళ్ళ కల్లాంటి భావములుండడంలో విచిత్రమేమిూ లేదన్నట్లుగా పకపకా నవ్వింది సరోజని.

" What Mr. Mohana Rao! (ఏమండీ, మోహన్‌రావు గారు) అల్లాగే నిల్చున్నారేం! రండి" అని కుర్చీచూపించాడు రెడ్డి.

(ఆంధ్ర) ... గ్రంథాలయము
తెలంప్రోలు (కృష్ణా)

మోహన్‌రావు చాల ఖిన్నవదనంతో ఆకుర్చీలో కూలబడ్డాడు. అతని హృదయాకాశంలో అనేక తుఫానులు లేవడం ప్రారంభించాయి. "సంతాననిరోధం" చెయ్యడంలో తప్పేమీ లేదని వాదించే మోహన్ రావుకు ఒకసారి తన మాతృదేవత జ్ఞాపకానికొచ్చింది. "అబ్బ! ఎంత పవిత్ర ప్రేమ! మాతృహృదయం కుమారునికోసరం యెంత త్యాగమైనా చెయ్యగలుగుతుంది. ఆ పవిత్రప్రేమ ఝరిలోని శీతలత అనభిజ్ఞులకెల్లా తెలుస్తుంది? వచ్చీ రాని ముద్దుమాటలతో, అమాయికమైన దృక్కులతో చేతులుజాచి దగ్గరకొచ్చే పసిపిల్లవాని చేష్టలను చూచినపుడు జననీహృదయం ఉప్పొంగి, తన అమూల్య ధనరాసిని, తన బంగారుకనిని, తన హృదయరత్నాన్ని జూచి గర్విస్తూ అనుభవించే ఆనందం, Birth control (సంతాననిరోధకం) లోని రుచి తెలిసిన నవనాగరికులకెల్లా తెలుస్తుంది?? సంతానవాంఛ పోతుందిగాని కామవాంఛ తగ్గదే! బిడ్డలుపుట్టితే సౌందర్యం తగ్గుతుందనుకొనే యీలలనామణులు ఇంద్రియనిగ్రహంజేస్తే యిప్పటికన్న సౌందర్యం పెరుగుతుందన్న విషయం గ్రహించరా? సంభోగం మానివేస్తే ఆటోమేటిక్ (దానంతటదే)గా సంతాననిరోధకం జరుగదూ? అల్లా చేయలేదు! కృత్రిమసాధనాలు కావాలి. దీనిపేరేనా Civilization (నాగరికత)?" అని మోహన్‌రావు ఆలోచిస్తున్నాడు. సరోజనీ, రెడ్డిగార్లు ఏమి మాట్లాడుతున్నదీ మోహన్‌రావుచెవికి వినిపించడంలేదు. తలకాయ వంచుకొని అల్లాగే భావతరంగ సంకులిత తరంగిణిలో మునిగిపోయినాడు. కొంతసేపటికి సరోజనివచ్చి చెయ్యిబట్టుకొని లేవదీయడంచేత తెప్పరిల్లి తలయెత్తి పైకి చూచాడు. సరోజని భర్త చెయి పట్టుకొని "ఏమిటీవేషం? నేను 10 నిమిషాలనుంచి మిమ్మల్ని పిలుస్తున్నాను, మీరు తలకాయవంచుకొని కూర్చున్నారు. భోజనానికి రారేంటి?" అనిఅన్నది.

"రెడ్డి యేడీ?......" అని భర్త ప్రశ్నించాడు.

"వెళ్లి అరగంటయింది" అని సరోజని జవాబుచెప్పింది.

మోహన్‌రావు లేచి భోజనానికి పోయినాడు, అన్నంముందు కూచున్నాడు గాని అన్నం సయించడంలేదు. నాల్గు మెతుకులు నోట్లో వేసుకొని బయటపడ్డాడు.

౬

రాత్రి షుమారు 8 గంటలయింది. సరోజనీ, Mr. రెడ్డి, Mr. దుర్గాప్రసాద్ కలిసి పేకఆడుకొంటున్నారు. 304 వేలంపాట ఆడుతున్నారు. సరోజనికి కళావరురాజు, రాణివచ్చినయి. రెడ్డి కళావరుఆసుదిగాడు. సరోజనీ కళావరురాణి వేయకతప్పలేదు. "రెడ్డిగారూ ! మీరు చాల అన్యాయంజేస్తున్నారు. యిస్తోకుచీల్చారు. రాజునుండి రాణినివిడదీయటం మీకుధర్మమేనా ? " యని సరోజని నవ్వుతూఅన్నది. రెడ్డి చిరునవ్వుతో "యితేకాదు. అసలుఆట ముందుంది " అన్నట్లుతలవూపాడు. 8-30 గంటలయింది.

రెడ్డి జేబులోనుంచి గోల్డుఫ్లేక్ సిగరెట్ పాకెట్ తీసి ఒకసిగరెట్ తననోట్లోపెట్టుకున్నాడు. " మీకుగూడా ఒకటికావాలండీ? " అని దుర్గాప్రసాద్‌ను అడిగాడు. దుర్గాప్రసాద్ ఒకసిగరెట్ తీసుకొన్నాడు. "తమరుగూడా ఒకటితీసుకొంటారా? " అనిసరోజనిని జూచి చిరునవ్వుతో ప్రశ్నించాడు.

" ఛీ! ఛీ! .... తప్పుగాదూ? " అని సరోజినిచిరునవ్వుతో అన్నది.

" ఓహో! సిగరెట్ త్రాగడం తప్పుకాబోలు! క్షమించండి "

"సిగరెట్ త్రాగడం తప్పుఅనిగాదు నేననడం. ఆడవాళ్ళు సిగరెట్ త్రాగడమేమిటి? అసహ్యంగా"

" Very sorry! (చాలవిచారం) మగవాళ్ళు తాగవచ్చునుగాని ఆడవాళ్ళుతాగకూడదను కాబోలు. మీస్త్రీజాతిలో వున్న ఈ 'యిన్ఫీరియారిటీకాంప్లెక్స్'(మేము తక్కువవారమనుతలంపు)మీజాతిని యిట్లాచేస్తున్నది" అని రెడ్డిగారన్నారు చిరునగవుతో. ఈమాటలు సరోజనిమీద బాగా పనిచేసినయి. ఆమె ఏమైనా సహించగలదుగాని పురుషులకంటె స్త్రీతక్కువ అనుమాట సహించలేదు. సరోజనికి సిగరెట్ త్రాగడాని కాహ్వానం లభించడానికదే ప్రథమపర్యాయం! అంతకుక్రితము ఆమె తనజీవితంలో సిగరెట్ తాగవలసివస్తుందని యెన్నడూ వూహించలేదు. చాలక్లిష్టసమస్యలో పడింది. అయినా— సిగరెట్ తాగడంలో తప్పేముంది? ఎంతమంది పురుషులు త్రాగుతున్నారు కారు? ఎంతమంది దొరసానులు త్రాగుతున్నారుకారు? తాను త్రాగితేమాత్రం తప్పేముంది? సిగరెట్ త్రాగటానికి నిశ్చయించుకుంది. కాని అదే మొదటిసారికావటంచేత మనస్సుమాత్రం వెనుకంజ వేస్తున్నది. కొంచెం సిగ్గుపడుతు "నేను సిగరెట్ తాగితేమీకేంపోరుగుతుంది?" అని నిమ్మళంగా అన్నది.

" O! That's very bad. (అది చాలతప్పు) ఇద్దరుస్నేహితులు సిగరెట్లు త్రాగుతూ ఒకస్నేహితురాలిని వదిలెయ్యటం న్యాయం కాదు" అని దుర్గాప్రసాదన్నాడు.

"మీరు ఒకటి తీసుకోక తప్పదు" అని రెడ్డిగారు ఒక సిగరెట్టు తీశాడు. కొంచెం సిగ్గుతో తలవంచుకొని సరోజిని చెయ్యిచాచింది. రెడ్డి సిగరెట్టు చేతికందిచ్చాడు. సరోజినికి దాన్ని ఎలాత్రాగాలో తెలిసిందికాదు. కాని మొదటినుంచి చాల సూక్ష్మబుద్ధికలదవటంచేత వారు త్రాగటంచూచి నిమ్మళంగా Imitate చేసి నేర్చుకుంది. ఒకగ్రుక్కపీల్చి వదిలి పకపక నవ్వింది. పొగ కండ్లల్లోకిపోయి కొంచెం నీళ్ళు కమ్మినయి. పవిటచెరుగుపెట్టి కళ్ళు తుడుచుకొని రెండవగ్రుక్కపీల్చి

మింగింది. కొంచెం కొరపోయింది. ఈ గడబిడంతా చూచి రెడ్డి పకపక నవ్వాడు. సరోజినికూడ నవ్వి "ఛీ! నాకక్కరలేదు పాడుసిగరెట్టు" అని అవతల పారేసింది.

"O' My fate! అలాపారేశారెందుకు? నిమ్మళంగా త్రాగితే చాల బాగుంటుంది" అని మరో సిగరెట్టుతీసి రెడ్డి ఇచ్చాడు. సరోజని వారిద్దరితో పాటు సక్రమంగానే ధూమపాన కాలక్షేపం జరిపి ముగించింది. తిరిగి ఆట ప్రారంభించారు, షుమారు పదిగంటలయింది.

షికారువెళ్లిన మోహన్ రావు వచ్చాడు. కొన్నిరోజులనుండి భార్యతో కలిసి షికారుపోవటం మానుకొన్నాడు. ముగ్గురూచీట్లపేకలాడు కోటం చూచాడు. మనస్సులో నొచ్చుకున్నాడు. కాని ఏమీ మాట్లా డకుండా ప్రక్కనేవున్న క్యాంపుకాటుమీద పడుకున్నాడు.

"మీరుకూడ రండి. మాకు నాలుగోచెయ్యి పూర్తి అవుతుంది" అని దుర్గాప్రసా దాహ్వానించాడు. కాని మోహన్ రావు అందుకొప్పుకోకుండా మంచంమీదనే పడుకున్నాడు. వారు ముప్పరు తిరిగి వారాటలో లీనమైనారు. వారి మామూలు పకపకలతో వారి ఆట సాగిపోతూ ఉన్నది. మోహన్ రావు ఇదంతాభరించలేకపోయినాడు. సరోజనిని అక్కడనుంచి ఎల్లాగైనా లేవదియ్యాలని ఉపాయ మాలోచించాడు. "నాకు చాల తలకాయ నొప్పిగా ఉంది" అని అన్నాడు. కాని ఆమాట వారికెవరికీ వినిపించలేదు. కొంచెంసేపున్నాక తిరిగీ "సరోజా! నాకు చాల తలకాయనొప్పిగాఉంది, అమృతాంజనమేమైనా ఉందా?" అని మోహన్ రావన్నాడు. మాట వింటంతోటే సరోజని ఆదుర్దాతో పరుగెత్తుకొస్తుందని ఆమోహన్ రావు ఊహించాడు. కాని "అమృతాంజనం ఇంట్లో లేనట్లున్నదండీ, రేపుప్రొద్దున వెతకొచ్చు. ఎందుకైనామంచిది, పనివాణ్ని పంపించి బజారునుంచి ఒకసీసా తెమ

నండి" అని సరోజిని కుర్చీలోనుండి జవాబు చెప్పింది. ఆజవాబుతో అంతవరకు లేని తలనొప్పి మోహన్ రావుకు తలనొప్పిలేకపోయినా ఇప్పుడు తలగిర్రున తిరిగటం ప్రారంభించింది. అబ్బా! ఎంతటిమార్పు! ఒకానొకరోజు గుంటూరులో నుండగా తనకు కొంచెం తలనొప్పివస్తే ఎంత ఆదుర్దా పడింది. ఎంత శుశ్రూష చేసింది. ఆరోజల్లా అన్నంతినటమే మానేసింది, కళ్ళవెంట నీళ్ళుపెట్టుకొని పక్కలో కూర్చొని విసనకర్రతో విసురుతూ ఎంత పరిచర్య చేసింది. ఆప్రేమంతా ఇవ్వాళ ఏమయింది. పాశ్చాత్య నాగరికతా పిశాచము మింగిందా!" నవనాగరికతా పరిణామం ఇంత క్రూరంగా ఉంటుందని మోహన్ రావు ఎన్నడూ ఊహించలేదు. అనాగరికతతో తాను స్వేచ్ఛగా ఆనందించవచ్చు ననుకొన్నాడు కాని ఈసుఖంగా దుఃఖించాలసివస్తుందని తానెన్నడూ అనుకోలేదు. నిజంగా ఇదే నవనాగరికతా ఫలితమైతే ఇల్లాంటి నాగరికతకు వేనవేల జోహారులు. ఈ నాగరికత మాదగ్గరకుకూడ చేరకుండుగాక. హేభగవాన్! ఇల్లాంటి నాగరికతను, ఇల్లాంటి Cultureను, ఇల్లాంటి Civilzation ను మా భారతీయ లలనలకు ప్రసాదింపకుందువుగాక!

మోహన్ రావుకండ్ల వెంబడి రెండు అశ్రుబిందువులు రాలినయి. అలాగే పడుకొని నిద్రపోయినాడు. ఆతడు కన్నుతెరిచేటప్పటికి షుమారు రెండుగంటలయింది. కాని ఇంకా పకపకలు వినిపిస్తునే ఉన్నవి.

౭

రాత్రి షుమారు ఏడుగంటలయింది. మోహన్ రావు గబగబా యింటికొచ్చాడు. కాని తలుపుతాళంవేసివుంది. తలుపు తెరచుకొని లోపలికి వెళ్లాడు. చదువుకుంటూ కుర్చీలోకూర్చున్నాడు. గడియారం ఎనిమిద కొట్టింది. కాని సరోజని ఇంకారాలేదు. ఒక్కడి

పోయిందోననుకొని మరోగంట వేచియున్నాడు. తొమ్మిదిగంటలయింది. కాని సరోజని ఇంకారాలేదు. మోహన్‌రావు హృదయం ఉద్విగ్నత చెందటం ప్రారంభించింది. ఒక్కర్తె ఎక్కడికి పోయియుంటుంది. సరే చూదామని మరోగంట వేచియున్నాడు. గడియారం పదికొట్టిందికాని సరోజని రాలేదు. మోహన్‌రావు హృదయంలో ఆవేదన హెచ్చ జొచ్చింది. రాత్రిపదిగంటలదాక ఒక్కర్తె ఏమిచేస్తుంది? ఎక్కడికివెళ్ళి యుంటుంది ? ఎప్పుడూ ఇంతసాహసించి వెళ్ళలేదే ? మోహన్‌రావు హృదయంలో అనేక భావాలు మొలకలెత్తినవి. సరోజనిమీద చాల కోపంవచ్చింది. తన దురదృష్టదశకు దుఃఖముకూడా వచ్చింది. ఒకానొకప్పుడు పొరుగింటికికూడా పోవడానికి భయపడిన సరోజని, ఒకానొకప్పుడు అత్తగారు వెంటలేనిదే పేరంటానికి ఇష్టపడని సరోజని, ప్రొద్దు గూకిన తరువాత వాకిట్లోకిరావడానికి భయపడే సరోజని ఇవ్వాళ రాత్రిపదిగంటలకుకూడ భర్తను వదిలిపెట్టి ఎక్కడికిపోయింది ? ఎంత సాహసం ! ఎంత మార్పు ! స్త్రీహృదయాలు నిజంగా చాలవిచిత్ర మైనవి. త్రోవచూపిస్తే చాలు మిగతాది వారే సంపూర్ణంచేస్తారు. గడియారం పదకొండుకొట్టింది. ఒకకారువచ్చి వాకిట్లోనిలబడింది. సరోజని కారులోనున్న నొకవ్యక్తికి Good night చెప్పి తాను గబగబఇంట్లోకివచ్చి కుర్చీలోకూర్చుంది. చేరుమాలుతో ముఖంతుడుచుకుంటూ, 'రెడ్డిగారు, నేను సినిమాకెళ్లాం. మిమ్మల్నికూడా పిలుద్దామనుకున్నాం కాని రెడ్డిగారు తొందరచేయటంచేత క్లబ్‌నుంచే సినిమాకెళ్లాం. పిక్చరు చాలబాగుంది, అంతా Romance యే. రెడ్డిగారు Translate చేసిచెప్పారు.' అని సరోజని అన్నది. మోహన్‌రావు మాత్రం ఏమీమాట్లాడలేదు. ఏమనాలోకూడ అతనికి తెలిసిందికాదు. అతని మనస్సు అతనిస్వాధీనంలోనేలేదు. ఒకవిధమైన ఆవేదనను, మానసిక క్లేశాన్ని అనుభవిస్తున్నాడు.

"ఇప్పుడొచ్చిన కారెవరిది ? " అని ప్రశ్నించాడు.

" Mr. రావుజీగారిది. వారుగూడా సినిమాకువచ్చారు."

అని సరోజని జవాబిచ్చింది.

ఉదయం మోహనరావు తన ఆఫీసుగదిలో నుండగా రావుజీ వచ్చాడు. మోహనరావు ఆహ్వానించలేదు. కాని రావుజీ వచ్చికుర్చీలో కూర్చున్నాడు. మోహనరావు ఏమిమాట్లాడకుండా ఏదో వ్రాసుకోవటం ప్రారంభించాడు.

" Hallow Mr. మోహనరావు ! ఎల్లాగో ఉన్నారు? శరీరంలో కులాసాగాలేదా ? అని రావుజీ ప్రశ్నించాడు.

" కొంచెం జబ్బుగాఉంది......" అని మోహనరావు సంక్షిప్తంగాజవాబిచ్చాడు.

" Then, send for a good doctor. (అయితే ఒక మంచిడాక్టరును పిలిచి మందుపుచ్చుకోండి.) " అని రావుజీలేచి గది వెలుపలకొచ్చాడు. రావుజీ కంఠస్వరాన్నివిని సరోజని బయటకొచ్చి రావుజీకి షేక్‌హేండిచ్చి లోపలికి తీసుకొనివెళ్లింది. ఇరువురు టీని త్రాగుతూకూర్చున్నారు. తనయెదుటనే సరోజని ఇంతభిడియం ప్రకటించకుండా ప్రవర్తించటం మోహనరావుకు చాలకష్టంవేసింది. ఒకానొకరోజున ఇల్లాంటివిషయాల్ని లెక్కచేయని మోహనరావుకు ఇవ్వాళ ఈపనులెందుచేతనో చాలఅసహ్యంగా కనిపించినవి. ఒకానొకరోజు ఫ్యాషన్ అని భావించిన ఈఆచారవ్యవహారాలన్నీ ఇవ్వాళ అతనిదృష్టిలో ఏహ్యమైనాయి. ఇకసహించలేక 'సరోజా' అని పిలిచాడు. సరోజని గదిదగ్గర కొచ్చింది. 'ఒకకప్పు టీ తీసుకొనిరా' అని మోహనరావు అన్నాడు. సరోజని వెళ్ళిపోయింది. రెండునిమిషాలకు పనివాడు టీతీసుకొనివచ్చి మోహనరావుఎదుట పెట్టాడు. మోహనరావు ఊహించినట్లుకాలేదు. తనకు టీ తీసుకరావటానికి సరోజని లోపలకు వెళ్ళుతుందని, అంతట రావుజీ లేచివెళ్లిపోతాడని, మోహనరావు ఊహించాడు. కానిఅట్లుజరుగనందుకు చాలచికాకుపడ్డాడు. గబగబాలేచి ' రావుజీ ! రావుజీ ! ' అని

కేకవేశాడు. రావుజీ బయటకొచ్చాడు. మోహనరావు రావుజీచెయ్యి పట్టుకొని 'కాఫీహోటలుకు వెళ్లుదాము రమ్మ'నమని గబగబగుంజాడు. కాని "అక్కర్లేదు. నేను కాఫీ త్రాగే ఇక్కడకొచ్చాను" అని చెప్పి రావుజీ తనచెయ్యి విడిపించుకొన్నాడు. మోహనరావు కొంచెం తెల్ల పోయి 'అయినా ఫరవాలేదు. మరొకసారివెళ్లుదాము రమ్మన' మని బలవంతాన బయటికితీసుకొని వెళ్లాడు. మరోగంటసేపటికి మోహన రావు తిరిగి ఇంటికివచ్చాడు. వెంటనే సరోజని వచ్చి, "అంత Mannerless (అమర్యాదగా) behave (ప్రవర్తన) చేస్తారేంటి? మీరు అతన్ని అలాబలవంతంగా బయటికి తీసికెళ్ళితే ఆయన మనస్సులో ఏమనుకుంటాడు? ఎవరో illiterate fools (విద్యావిహీనులైన పశువులు) ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తే బాగుంటుందా? మీరిలాచేస్తే అసహ్యంగాఉంటుంది. Westerners (పాశ్చాత్యులు) ఇంత (unmannerlyగా ప్రవర్తించరు. నిజంగా ఇవాళ మీరుచేసినపనికి నాకుచాల కోపంవచ్చింది. మనఇంటికి వారొచ్చినప్పుడు మనం వారినలాచేస్తే, మనం వారింటికెళ్ళినపుడు వారు మనలనెలా మర్యాదజేస్తారో వూహించుకోండి. మరోసారిమాత్రం అంత Rash గా (అసహ్యంగా) ప్రవర్తింపకుండా ఉండాలని నాప్రార్థన" అని సరోజని చాలగంభీరంగా అన్నది. 'నేను వారింటికెళ్ల వలసిన అవసరంలేదు...' అని, చాలవేగంగా భోజనంచెయ్యకుండానే మోహనరావు కోర్టుకువెళ్ళిపోయాడు.

తరువాత సరోజని భోంచేసి నిద్రపోయింది. సాయంత్రం నాలుగు గంటలుకావటంతోనే మామూలుగానే ముస్తాబయి Racket నుతీసికొని క్లబ్బుకు వెళ్ళింది. ఆరోజు రావుజీగారు విందుకు పిల్చడంచేత సరోజని ఆరాత్రిరావుజీగారింట్లోనే భోజనంచేసింది. తరువాత కొంచెం సేపు Music performance (గాన ప్రదర్శనము) జరిగింది. తరువాత రాత్రిషుమారు పండ్రెండుగంటలకు రావుజీగారిదగ్గిర శెలవుతీసుకొని సరోజని ఇంటికొచ్చింది. మోహనరావు ఏంచేస్తున్నాడోనని ఆయనగదిదగ్గరకెళ్ళి తొంగిచూచింది. మోహనరావు గోడవైపుకు

ముఖంపెట్టి పడుకొనున్నాడు. నిద్రపోతున్నాడుకాబోలు ననుకొని
సరోజని తనగదిలోనికివెళ్ళి పడుకుంది. నిద్రపోకుండా మోహనరావు
ఏడుస్తున్నసంగతి ఆమెకేమి తెలుసు !!

౭

వారంరోజులనుంచి మోహన్‌రావుకు జ్వరం తగులుతున్నది. జబ్బు
రోజురోజుకు పెరుగుతున్నదేగాని తరగడంలేదు. ఈ వారంరోజు
లకే మనిషి చాల దుర్బలుడైపోయినాడు. తనకు తీరిక లేకపోవడంచేత
భర్తకు పరిచర్య జేయడానికి ఒక 'నర్సు' ను యేర్పాటుచేసింది సరోజి
ని. ఆమె దైనికచర్యలో మాత్రం మార్పేమీ కలుగలేదు.

సాయంత్రంపూట మోహన్‌రావుకు మందిచ్చేవేళ అయిం
ది. సరోజిని తన గదిలోనికిపోయి "ఫేస్ పౌడర్" డబ్బా తీసింది. కాని
పొరబాటున అది చెయిజారి క్రిందబడింది. సరోజిని కొంచెం విసుక్కొం
టూ "స్నో బాటిల్" తీసి, రెడ్డిగారు క్లబ్‌కు వెళ్ళడానికి చాల తొందర
జేస్తుండడంచేత, గబగబా ముఖానికి రాసుకొని 'రాకెట్' తీసుకొని
బయలుదేరింది. "టైం అయింది నేను అర్జంటుగా వెళ్ళాలి. నీవు మందు
కలిపి యివ్వు" మని నర్సుతో చెప్పి సరోజని రెడ్డితోబాటు క్లబ్‌కు
వెళ్ళింది.

మోహన్‌రావు జబ్బు దినదిన ప్రవృద్ధమానమవుతున్నది.
నెలరోజులు గడిచింది. మనిషి సంపూర్ణంగా క్షీణించి పోయినాడు.
ఎముకల పంజరంలా తయారయినాడు. స్పష్టంగా మాట్లాడడానికి గూడా
శక్తిలేకుండాపోయింది. మనుష్య సహాయంలేనిదే మంచంమీదలేచి
కూర్చోలేకుండా అయిపోయినాడు. ఒకమెతుకు అన్నమైనా లోపలికి
పోవడంలేదు. పాలుయిచ్చినప్పటికీ త్రాగేవాడుకాదు. ఆతనిముఖంలో

తేజస్సు క్షీణించింది. కన్నులలోని జ్యోతి రోజురోజుకు ఆరిపోతున్నది. మనస్సు శిథిలమైపోయింది. అప్పుడప్పుడు తన మాతృదేవిని తలుచుకుండేవాడు. అప్పుడు అతనిహృదయం ఉప్పొంగి గంతులువేసేది. అతని హృదయంలో చల్లని జ్యోత్స్న వెల్లివిరిసేది. అతనిమస్తిష్కం ఆనంద రసాస్వాదన చేయడం ప్రారంభించేది. అబ్బ! మాతృప్రేమను తలంచుకొని ఉన్మత్తుడై, పవిత్రప్రేమ వాహినిలో మునుకలువేస్తూ నతమస్తకుడుగాని ప్రేమారాధకుడుంటాడా??? జననీ హృదయంలోని పవిత్రప్రేమమకరందాస్వాదన చెయ్యలేక జిల్లేడు పుష్పాలమీదికి పోయే కందిరీగలుగూడా ప్రేమారాధకులేనా?? ఈపాశ్చాత్య నాగరికత పైపై మెరుగులతో మెరిసే పయోముఖ విషకుంభమేనా? ఎంత మోసపోయాడు మోహనరావు! అది శీతల జలప్రవాహమని భ్రమపడ్డాడు. కాని, అది మృగతృష్ణ! పాశ్చాత్యనవ నాగరికతా ఉద్యానవనవీథులలో విహరింప వచ్చునను కొన్నాడుగాని అవి క్షీకర అధఃపతన మార్గాలని గ్రహించలేదు! ఆ వినీలవిశాల ఆకాశంలో స్వచ్ఛందంగా ఎగురవచ్చుననుకొన్నాడు గాని అక్కడ పిడుగులు పడతవని తెలియదు! ఎంతమోసపోయినాడు? ఈకష్టదశలో అతనిహృదయానికి కొంచెం తాపోపశమనంజేసేవి పూర్వపు స్మృతులే! ఒకానొకప్పుడు తనకు తల్లిమీద కోపమొచ్చి అలిగి అన్నంతినకపోతే, తల్లివచ్చి యెంతబ్రతిమలాడింది! తనసరోజ అమాయకమైనచూపులతో, తనదగ్గరికి రావడానికి భయపడి, మౌనంగానే కన్నులద్వారా తనిహృదయా వేదనను తెలియబరచింది!! ఆరోజులలో సరోజనికి నవనాగరికత తెలియదు! పాశ్చాత్యవేష భాషలు తెలియవు! ఆరోజులలో ఆమె ఒకభారతీయ లలనయే!! ఒకసారితాను టక్కరితనంగా, జ్వరంవచ్చి బాధపడుతున్నట్లు నటిస్తే సరోజనిపొందిన ఉద్విగ్నత, ఒకసారిజ్ఞాపకానికొచ్చింది. జాలి చూపులతో, అమాయికమైన ఆవేదనతో, అదుర్దాతో కాళ్ళకు మెలివేసుకొని ఏడ్వడంప్రారంభించింది!! రెండుఅశ్రుబిందువులు క్రిందపడినాక తానుపకపకా నవ్వాడు! ఈదొంగవేషమంతా అప్పుడుగ్రహించింది

సరోజని. కొంచెంకోపంతో గబగబావెళ్లిపోబోయింది. వెంటనే తానులేచి, తనఅర్ధాంగిని బిగియారకౌగలించుకొని, హృదయానికి హత్తుకొని, ఆవిడలో లీనమైపోయాడు! ఈదృశ్యం జ్ఞాపకానికొచ్చింది మోహనరావుకు. వెక్కి-వెక్కి-యేడ్వడంప్రారంభించాడు. ఎంతసేపుపడ్చాడో తనకేతెలియదు, తనకొకసారి నిజంగానే మలేరియాజ్వరమొచ్చింది. విషంలాగా చేదుగావుండే ఆ 'క్వినైన్ మిక్చర్స' త్రాగలేకపోయేవాడు. అప్పుడు తన సరోజని యెంతబ్రతిమాలేది! ఎన్నికబుర్లు చెప్పేది!! చంటిపిల్లలను మోసగించినట్లు మోసగించి మందుత్రాగించాలనుకొనేది! ఒకగంటసేపు తిప్పలుబడేది. తాను మందుత్రాగేవరకు ఆవిడ అన్నంగూడా తినేదికాదు. చివరకు "మీరు మందుత్రాగకపోతే నన్నుచంపుకొన్నట్లే!!" అని ఒట్టుపెట్టుకొనేది. వెంటనే తాను మందుత్రాగేవాడు!! .... ఛీ ఛీ!! ఈదృశ్యాలు కనపించకుండావున్నా బాగుండు! అబ్బ! ఎంత హృదయవేధకం! .... అన్నంసయించక తాను అన్నంతినకపోతే, తనతల్లి, తన హృదయాధిష్ఠానదేవత, తనఉపాస్యదైవతము, తననెంతబ్రతిమాలి బలవంతాన విస్తరిముందు కూర్చోబెట్టి, ఎన్నోకబుర్లు చెప్తూ "కాకమ్మ, పిచ్చికమ్మ" కథలుచెపుతూ ఒక్కొక్క ముద్దతననోట్లోపెట్టేదీ! పాపం!! తన తనయుడు బి. ఎ. ప్యాసయిన విద్యాధికుడైనప్పటికి, తల్లి 'కాకమ్మ పిచ్చికమ్మ' కథలనే చెప్పేది! నిజంగా, తల్లినోటినుంచి వచ్చే ఆకథలలో తాను షేక్స్పియర్, టెన్నిసన్ల రచనలకంటే మాధుర్యాన్ని అనుభవించేవాడు. తిరిగి ఆరోజులు తనకు రావా?? యింకెక్కడరావడం!! శ్మశానంలోని అసంఖ్య సమాధులలో తాను గూడా ఒక సమాధిని అలంకరింప బోతున్న తనకు మరల ఆరోజులు రావడమా!! అనేక మందులు వాడి డాక్టర్లు నిరాశచెందిన యీ రోగం నయంగావటమా! ఒకవైపున మృత్యువు ఆహ్వానిస్తుంటే తనకీ గొంతెమ్మకోరికలెందుకు??

౯

ఇవ్వాళ మోహన్‌రావుకు జబ్బు మరీతీవ్రంగావుంది. 102 డిగ్రీల టెంపరేచర్ వచ్చింది. సరోజనిమాత్రం అప్పుడప్పుడు అతనిగది లోనికిపోయి, కొంచెం పల్కరించివచ్చేది. కాని, ఆగదిలోనిల్చుండే రెండునిమిషాలు చాలకష్టంగావుండేది.

ఆరోజు సరోజని తనగదిలోని ఈజీచైర్‌లోపడుకొని ఒక ఇంగ్లీషునవల చదువుకుంటున్నది. ఆవిడమనస్సంతా అందులో లీనమై పోయింది. కాని అకస్మాత్తుగా ఆవిడహృదయంలో కొన్నిభావాలు లేచినయి !! ఒకవేళ మోహన్‌రావు చనిపోతే !! తానేంచెయ్యాలి ? ? ఈభావం ఆవిడహృదయాన్ని యివ్వాళ బాధకలిగించలేదు. కొంచెం ఆనందించిందనికూడా చెప్పవచ్చు ! తనభర్త చనిపోతే, శ్రీమతి నాయుడు, శ్రీమతి రెడ్డి, మిస్ హుక్, మిస్ రోజ్, మిస్టర్ రెడ్డి, మిస్టర్ ప్రసాద్, మిస్టర్ రావు మొదలైనవారంతా తనను పల్కరించటానికివస్తారు ! అప్పుడు తానేం చేయాలి ? 'అయ్యో ! నాహృదయాధినాథుడు, నా ప్రాణవల్లభుడు నన్నువదలి స్వర్గానికి పొయ్యాడు. నన్ను సర్వనాశనంచేశాడు! ఇక నాజీవితం దీపికలేని శూన్యగృహంలాంటిది' అని కళ్లవెంట నీళ్లుబెట్టుకొని అనాలి! 'నాకోసరం మీరు విచారపడనక్కరలేదు. మరణించిన పవిత్రాత్మకు శాంతి కలిగితే అదేనాకు పదివేలు' అని ఇంగ్లీషులో అనాలి!! శ్మశానానికి పోయేటప్పుడు తాను యేరకంచీరె కట్టుకోవాలి? తరువాత అనేక సానుభూతిపత్రాలు వస్తాయి. అప్పుడు ఒకపత్రికలో "నాభర్త మరణించినందుకు సానుభూతిదెల్పుచూ అనేకమందిమిత్రులు ఉత్తరాలు వ్రాస్తున్నారు. కాని, దుఃఖసాగరంలో మునిగియున్న నేను ప్రతిఉత్తరానికి విడివిడిగా జవాబువ్రాయజాలనందులకు విచారపడుచున్నాను. మా మిత్రులు నాయెడజూపు సానుభూతికెంతయు కృతజ్ఞురాలను. స్వర్గస్థ

...చేసన గ్రంథాలయం

మైననాప్రియునిఆత్మకు శాంతికలుగునట్లు భగవంతుని ప్రార్థించెదరు గాక !! " అని ప్రకటించాలి. అప్పుడు చాలదర్జాగావుంటుంది.

ఈవిధమైన భావకెరటాలలో సరోజని మునిగిపోయింది. ఇంతలోనే 'నర్సు' వచ్చి, " బాబుగారు పిలుస్తున్నారు " అని చెప్పి వెళ్లిపోయింది. క్లబ్బుకువెళ్ళే వేళకూడా కావడంచేత, యిస్త్రీచీరకట్టుకొని, రాకెట్ తేసుకొని భర్తగదిలోనికి పోయినిల్చుంది. మోహనరావు మంచంమీద పడుకొనివున్నాడు. ఆతనికళ్ళవెంట నీళ్లుకారుతున్నాయి. దాన్నిచూసి సరోజని కొంచెంజాలిపడి, " ఏంచెయ్యను ! ...ఏం... మరొకడాక్టరును పిల్వమంటారా ? " అని ప్రశ్నించింది.

"అక్కరలేదు. సరోజా ! అక్కరలేదు. నాకొక్క కోరిక వుంది. ఇంతవరకూ నీవు నాఆజ్ఞ పాలిస్తూవచ్చేవు. యివ్వాళ నాకోరిక గూడాస్వీకరిస్తావని హృదయపూర్వకంగా విశ్వసిస్తున్నాను. నిజంచెప్పు. సరోజా ! నాప్రార్థనను అంగీకరించవా ?" అని మోహనరావన్నాడు.

" ఏమిటి మీకోరిక ? ...... "

" సరోజా ! నన్ను ఒకసారి తిరిగి నామాతృదేవి చరణసన్నిధిలోకిచేర్చు. ఇదే నాకోర్కె. "

" మీజబ్బును మీఅమ్మగారు నయంజేస్తుందా ? మీఅమ్మగారు డాక్టరుపరీక్షగూడా ప్యాసయిందాయేమిటి ? " అని సరోజని కొంచెంఅవహేళనగా అన్నది.

" కాదు సరోజా ! ఏ డాక్టరూ బాగుచేయలేని నాజబ్బును ఆమె ప్రేమసించితహృదయం, ఆమె అమృతవాక్కులు నయంచేయగలవు. సరోజా ! ఈపట్టణం, ఈ సొసైటీ యెప్పుడువదిలేసి బయటపడదామాఅని హృదయం ఆదుర్దాపడుతున్నది. ఈపట్టణంలో నేను

మరణిస్తే నాఆత్మకుగూడా శాంతి లభించదు. సరోజా ! ఆమెకు ఒక టెలిగ్రాం యిప్పించు. ఆమెను యింకాపాశ్చాత్యనవనాగరికత ఆవరించ లేదు. ఆమెహృదయంలో యింకాప్రేమవున్నది. ఈకబురువినడంతోటె ఆమె యిక్కడకు పరుగెత్తుకొనివస్తుంది. ఆమె పవిత్రప్రేమోన్మత్త హృదయం, ఆమెప్రేమసించితమృదుమధురకంఠస్వరం, ఆమెపుత్రప్రేమ నాహృదయంలో మందాకినిని ప్రవహింపజేస్తయి. అప్పుడు నాహృద యం, యెంతశాంతిని అనుభవిస్తుంది ? అపుడు నాహృదయం యెంత ఆనందాన్ని అనుభవిస్తుంది ? సరోజా ఆమెను పిలిపించు ! వెయ్యి మందిడాక్టరులు చెయ్యలేనిపని ఒక్కఆమెపవిత్రప్రేమ చెయ్యగలుగు తుంది. " అని మోహనరావన్నాడు.

ఇదంతా జ్వరప్రలాపమని భావించింది సరోజని. " మీరు గోలచెయ్యకండాపడుకోండి ! నేను వెళ్లిమరోకడాక్టరును పిలుచుకొ స్తాను " అని సరోజని రెండడుగులు వేసింది. మోహనరావు " సరో జనీ ! అలాఅనకపోతే క్లబ్‌కువెళ్లివస్తానని చెప్పరాదు ? నీకు భయ మెందుకు ? రాకెట్‌తీసుకొని, మునాబెపోతున్న నీవు క్లబ్‌కువెళ్లు తావో, డాక్టరింటికి వెళ్లుతావో నాకుతెలియదు ? ? " అనిఅన్నాడు. సరోజని స్తబ్ధురాలైంది. తిరిగి మంచందగ్గిరకొచ్చి నిల్చొబడింది. మోహ నరావు ఉద్రిక్తుడైలేచి కూర్చున్నాడు. ఆతని ముఖంఎర్రబడి, చాల గంభీరంగా మారింది. రెండునిమిషాలుమౌనంగా నేలవైపు చూచి చాలగంభీరమైనస్వరంతో " సరోజనీ ! నీతో రెండుమాటలు చెప్పా లనుకొంటున్నాను. కాని ధైర్యంచాలలేదు. యివ్వాళ చెప్పకతప్పదు సరోజా ! నేను తిరిగి నాపూర్వజీవితాన్ని గడపవాలనని వాంఛిస్తు న్నాను. నాకు యీనూతనజీవితంలో ఆనందంలేదు ! సౌఖ్యంలేదు ! ! శాంతిలేదు !!! సరోజా ! ఈజీవితాన్ని తలుచుకొన్నపుడు నాహృద యం పగిలిపోతుంది. ఇదే నారోగానికి కారణం. నాది శారీరకవ్యాధి కాదు. సరోజా ! ఇది మానసికవ్యాధి ! నేను యీనవనాగరికతలోని

ఆనందమున్నదని భ్రమపడ్డాను. మోసపోయినాను. నవనాగరికతలోని ప్రతిపరమాణువు పరిశీలించాను. చివరకు నాస్వానుభవంవల్ల, యిందులో సౌఖ్యంలేదని గ్రహించాను. సరోజా! వద్దు! వద్దు! ఈనాగరికత మనకొవద్దు!! నీవు పూర్వపుస్త్రీగా మారిపో! ఏయువతిహృదయం పవిత్రప్రేమపూరితమైయుండేదో, ఏయువతి తనతోడిస్త్రీలతో గూడ మాట్లాడడానికి సిగ్గుపడేదో, ఏయువతిలో స్త్రీస్వభావమైన లజ్జతొణికిసలాడుతుండేదో, ఏయువతి తనకుటుంబమే తానుగా భావించేదో, ఏ యువతి దైవభక్తిపరాయణయై ఆదర్శభారతలలనయై యుండెడిదో, ఆసరోజనివిగా మారిపో!! సరోజా! నాప్రార్థనను స్వీకరింపవా? సరోజనీ! నీహృదయాన్ని ప్రశ్నించు! నీవు ఆనాటి సరోజనివేనా? ఆనాటి పవిత్రహృదయమేనా నేడు!! పరపురుషులవైపుచూడడానికి కూడాభయపడే ఆనాటి సరోజనివేనా? సరోజా! పాశ్చాత్యనవనాగరికతా పరిణామము యింతక్రూరంగా, యింతభయంకరంగా వుంటుందని నేనూహించలేదు. నేనుగూడా బి. ఏ. ప్యాసయినాను. నేనూ చాల కాలం పాలిష్డ్ సొసైటీలో తిరిగాను. కాని, సరోజా! నీలోకలిగినంత మార్పు నాలోకలుగలేదు. నాస్వానుభవంవల్ల నేడుగ్రహించాను! స్త్రీహృదయం చాలసున్నితమైనది. చాలమృదువైనది. అట్లాంటి కోమల హృదయాలమీద పాశ్చాత్యనాగరికత తనభయంకరతను తొందరగా చూపెట్టగలుగుతుంది. సరోజా! నాప్రార్థననుస్వీకరించు. సంపూర్ణంగా నీవు నాదానవై, నేను నీవాడనై వుండాలనినాకోరిక, నాకోరికనుతిరస్కరించవనే నేను సహృదయపూర్వకంగా విశ్వసిస్తున్నాను. ప్రియా! నీ అంతరాత్మను ప్రశ్నించు. నీహృదయం ఎంతమారిపోయింది. ఎంతమలినమైపోయింది. నేను బాగాగ్రహించాను, స్వేచ్ఛ, ఉచ్ఛృంఖలత, నిర్లజ్జత, స్వార్థం కంటే యీ 'పాలిష్డ్ సొసైటీ' (Polished Society) లో మరేమీలేదు. తనభార్య పరపురుషునితో నీచప్రసంగాలుచేస్తుంటే, నవనాగరికతా పిశాచంఆవహించి కళ్లుమూసుకొనిపోయిన నావంటి భ్రష్టుడు మౌనంగాసహించగలడుగాని, సరోజా! నిజ

మైనభారతీయుడు సహించలేడు. అది పాశ్చాత్యులకే తగిపోయింది. వారినాగరికత రక్తంలోలాలిమలేని వారికే తగిపోతుందిగాని భారతీయులకు తగదు. ఒకహిందువుడు తనసర్వస్వాన్ని, తనప్రాణాలని గూడాఅర్పించి తనభార్యమానరక్షణచేస్తాడు. యివ్వాళ ఒకమొగుడుతో, రేపు మరొకమొగుడుతో, ఎల్లుండి యింకొకమొగుడుతో కాపురంచేయడానికి ఒకనిజమైన హిందువుడు ఒప్పుకోగలడా? భారతీయుని రక్తంలో యింకాకొంచెం పౌరుషంమిగిలింది. సరోజా! నాకోరిక మన్నించు! నాప్రార్థనస్వీకరించు. ఇక యీమాయలో ఒక్కనిముషం గూడావుండలేను. నేను యీస్వార్థయుతమైన, అసభ్యమైన, భ్రష్ట సమాజంలో ఒక్కనిముషంగూడా వుండలేను. నన్ను తిరిగి ఆపవిత్రసరితలోస్నానంచేయించు. నన్ను ప్రాయశ్చిత్తంచేసుకోనివ్వు. సరోజా! నీవు గూడా ఆపవిత్రమందాకినిలో స్నానంచెయ్యి. ఇరువురం తిరిగి ఆపవిత్రప్రేమోద్యానంలో విహరిద్దాము. ఆపవిత్రప్రేమసౌరభాలను ఆఘ్రాణిద్దాము. ఆపరిశుద్ధప్రేమసించితమలయమారుతంలో గంతులేద్దాము. ఆ జగన్నుత ఆర్యవైవాహికసూత్రంతో ఒకరినొకరముకట్టివేసుకొందాము. తిరిగి ఆపండువెన్నెలలో పరుగెత్తుదాము. సరోజా! నాప్రార్థనఅంగీకరించవా?" అని అన్నాడు.

సరోజని నిశ్చేష్టయై నిల్చుంది. ఆమె ముఖం చాల గంభీరంగా మారింది. కన్నులుమూసుకొన్నది. తనహృదయాన్ని తట్టి ప్రశ్నించింది. అంతర్వాణి సమాధాన మిచ్చింది. "ఇందులోని ప్రతి అక్షరము యదార్థమే!!!" సరోజని మనస్సులో అనేకదృశ్యాలు కనిపించినయి. అనేకమంది ఫొటోలు కనుపించినయి. సినిమారీల్సు లాగా గిర్రున పరుగెత్తుతున్నయి. సరోజని హృదయం "అందులోని ప్రతిఅక్షరముయదార్థమే!" ననిచెప్పింది. సరోజని అంతర్చక్షువులను విప్పి చూచింది. ఆమెలో యింకా భారతీయత కొంచెంశేషించి వున్నది. అనేకమంది పవిత్ర భారత లలనలు తమహృదయ రక్తాన్ని ధారబోసి, తమప్రాణా

లను బలిదానం చేసి, తమ సర్వస్వాన్ని త్యజించి, నేటివరకు కాపాడిన "మానధనము" యెంత పవిత్రమైనది! ఆ ధనాన్ని దొంగలించటానికి ఎంతమంది ప్రయత్నించారు! ఎందరు మ్లేచ్ఛులు దండాలు పన్నారు! కాని ఎవరికైనా చిక్కిందా?? అల్లా ఉద్రేకాను చిమ్మారు కోటలలో రాశులకు రాశులు బూడిద చిక్కింది! అంతే! భారతీయ 'మానధన' మెవరికు చిక్కుతుంది? స్వర్గాదిరోహిత లైన భారతీయ పతివ్రతల ఆత్మలలో శక్తి చచ్చిపోయిన నాడు, భారతీయ రక్తంలో లాలిమ నాశనమయిన నాడు, భారత మస్తిష్కంలో దేశభక్తి నశించిన నాడు, హిందువులలోని ఆత్మగౌరవం అడుగంటిన నాడు, సర్వప్రపంచానికీ వెలుగు చూపెట్టిన భారత ఋషులలోని ఆత్మ తేజం మాయమై పోయిననాడు భారతీయ లలన "స్వాతంత్ర్య"కు దాసిన అయితుంది. పాశ్చాత్య నాగరికతను ఊడిగం చేస్తుంది! కాని, ఆ దౌర్భాగ్యం భారత దేశానికి యింకా సంపూర్ణంగా కలుగలేదు! సరోజిని కనులనుండి రెండు అశ్రుబిందువులు రాలినయి! భర్త పాదాలమీద పడింది. వెక్కి వెక్కి యేడ్వటం ప్రారభించింది. ఆవిడ హృదయము పశ్చాత్తాపాగ్నిచేత పరిశుద్ధమయింది! ఆవిడగర్వం చూర్ణమయింది! ఆవిడ ఆత్మ పరితప్తమైన పదహారు వన్నెల బంగారులాగా తేజోవంతమయింది! భార్యా భర్త లిరువురు కౌగలించుకొన్నారు! ఆరోజు రాత్రే గుంటూరుకు ప్రయాణ మయ్యారు!!

౧౦

గుంటూరు స్వరాజ్య మైదానంలో జనం కిక్కిరిసి పోయినారు. సభ కల కల మంటున్నది. సాయంత్రం 5 గంటలయింది. మోహనరావు ఉపన్యాసవేదిక నెక్కాడు. సభికులంతా ఉత్సాహంతో చప్పట్లు చేశారు. మోహనరావు గంభీరంగా ఉపన్యసించడం ప్రారంభించాడు:—

"సోదర సోదరీ మణులారా! నేటి భారతదేశ దౌర్భాగ్యం మనం చూస్తూనే యున్నాము. ఒకానొకనాడు ప్రపంచాని కంతటికి వెలుగు ప్రసాదించిన భారతదేశం నేడు యీ దీనస్థితి పొందటానికి కారణం విదేశీయులను "యిమిటేట్" చేయడమే! భారతదేశంలోని నేటియువకులు పాశ్చాత్య నాగరికతా ప్రవాహంలో మునిగి, కన్నుగానక మనపూర్వ సంస్కృతిని, మన Ancient culture(పూర్వపు నాగరికత)ను, పూజ్యులైన మన పూర్వజులను, తిరస్కరిస్తున్నారు. నేడు ప్రపంచములో కంతటికి అత్యంత "ఫ్యాషనబుల్" దేశములుగా పరిగణింపబడే దేశములలోని ప్రజలు గుడ్డకట్టుకోవడం గూడ తెలియని అనాగరికస్థితిలో నున్నపుడే భారతదేశంలోని ఋషులు యమునా తీరంలో ఆధ్యాత్మిక జిజ్ఞాస చేశారు. విజ్ఞానం(Science)లో అద్భుతమైన పరిశీలన చేశారు. అనేకఉత్తమోత్తమ గ్రంథాలు రచించినారు. దానినే అరవింద ఘోష్ గారు యిల్లా వ్రాస్తున్నారు. " The ancient civilization did possess secrets of science, some of which modern knowledge has recovered, extended and made rich and precise but others are even now not recovered" (మనపూర్వుల నాగరికతలో అనేక రహస్యాలుయిమిడివున్నాయి. అధర్వణవేదంలో వ్రాయబడిన ఆ విజ్ఞానంనే నేటిపాశ్చాత్య విజ్ఞానవేత్తలు బయటకుతీసి, మెరుగుపెట్టి, మనకు చూపెట్టుతున్నారు. యిల్లాంటివే యింకా అనేక విషయాలు, ఆధునిక విజ్ఞానవేత్తలు యింతవరకూ గ్రహింపనివి, గూడా మనగ్రంథాలలో వున్నాయి) సోదరులారా! అల్లాంటి మననాగరికతను మనంగ్రహించలేక పోతున్నాము. ప్రపంచానికంతటికీ జ్ఞానభిక్ష పెట్టింది మనదేశం! ప్రపంచాని కంతటికి వెలుగు ప్రసాదించిందిమనవేదాలు ! అల్లాంటి పవిత్రమైన మనవేద ధర్మాన్ని మనం దూషిస్తున్నాము. మనపెరటిలో మూలిక గుణంమనం గ్రహించలేకపోతున్నాము. కాని, దానినే పాశ్చాత్య పండితులు ప్రశంసిస్తున్నారు. పవిత్రమైన మనవేదములను జూచి చకితులై పోతున్నారు. మన

పూర్వుల నాగరికతకు ఆశ్చర్యపోతున్నారు. ప్రొఫసర్ మాక్స్ ముల్లర్ (Professor Max Muller) గారు యిల్లా వ్రాస్తున్నారు:- In the history of the world, the Vedas fill a gap which no literary work in any other language could fill " (ప్రపంచ చరిత్రలో, యేయితర భాషలోని గ్రంథములును పూర్తి చేయజాలక పోయిన మహా గొప్ప విషయమును వేదములు పూర్తి చేసినవి).

గ్విగాల్ట్ గారు (Guigault) యిల్లా వ్రాస్తున్నారు. "The Rigveda is the most sublime conception of the great high ways of humanity" (ఋగ్వేదము మానవజాతి కంతటికిని సర్వశ్రేష్టమయిన ఆదర్శరచన)

మాన్స్ లోఇ డెల్ బాస్ గారు (Mons Leon delbos) యిల్లా వ్రాస్తున్నారు:— "There is no monument of Greece or Rome more precious than Rig Veda" (యూరప్పు దేశ ములందలి అత్యధిక నాగరిక దేశములగు గ్రీసు, రోము, సందలి యే గ్రంథము ఋగ్వేదముతో సరితూగజాలదు)

ఈ విధంగా అనేక మహానుభావులు భారతీయ విజ్ఞానాన్ని, వేదాలను, ప్రశంసించారు. ఎన్నని చెప్పను? వాల్టాయిర్ (Voltaire) గారికి యజుర్వేదము బహూకరించినపుడు వారు " Veda was the most precious gift for which the west had been ever indebted to the East" (పాశ్చాత్యులమైన మాకు వేదములు అమూల్య జ్ఞానమును ప్రసాదించినందులకు మేము ప్రాచ్యదేశీయుల (భారతీయుల) కెంతయు ఋణపడి యున్నాము.)

సోదరులారా! ఏ పాశ్చాత్యనాగరికత వెంట మనము కుక్కలవలె పరుగెత్తుతున్నామో, ఆపాశ్చాత్యులే మన పూర్వీయుల సంస్కృతికి చెరుగు బట్టుతున్నారు. మనము యెంత భ్రష్టులమైనాం, యింకా

మనలో మనపూర్వులరక్తం ప్రవహిస్తునే వున్నది. నేటికిగూడ మనము 'ఆర్యుల'మని గర్వించాలి. ఒకానొకప్పుడు ప్రపంచాన్నంతటిని ఉర్రూతలూపిన జాతి మనది!! మనలో ఆర్యరక్తంవేడిగా ప్రవహించేటంతకాలం, మన హిందుదేశంలో ఒక్క హైందవబాలకుడైనా జీవించి యున్నంతకాలం, మనసంస్కృతి, మననాగరికత మన కళ్ళయెదుట నాశనంచేయబడడం చూడజాలము. హృదయంలేని, స్వార్థయుతమైన "ఫ్యాషన్" మనకక్కరలేదు. ప్రపంచంలో కంతటికే "ఫ్యాషనబుల్" పట్టణంగా పేరొందిన "పారిస్ పట్టణం"లో నూటికి 95 మంది సుఖవ్యాధి పీడితులని విన్నప్పుడు మీహృదయం చలించడం లేదూ! ఈఫ్యాషనేనా భారతదేశానికి కావాలనడం. ఈ ఫ్యాషను నేనా మనం మన పిల్లలకు నేర్పడం. జోహారు! ఫ్యాషన్! నీకు వేనవేలజోహార్లు. మాభారతదేశానికిరావాకు. ఇంతకు క్రితం కొంచెం కొంచెంగా వచ్చి వున్నయెడల, తిరిగినీదేశానికి వెళ్లిపో. నిన్ను ఆదరించేది ఆపాశ్చాత్యులే. ఒకానొక్కప్పుడు అతులసౌభాగ్యాన్ని అనుభవించిన భారతదేశం, అనంతజ్ఞాన రసాస్వాదన చేసిన భారతదేశం, జగదేకప్రశంసనీయమగు నాగరికతను చూరగొన్న భారతదేశం, ఆధ్యాత్మిక జ్యోతిలో కన్నులు తెరచిన భారత దేశం నిన్ను గౌరవించదు! నిన్నుగాక మొన్న గుడ్డకట్టుకోవడం నేర్చుకొన్న ఆతెల్లవారి దగ్గరికే పో. వారేనిన్నుగౌరవిస్తారు. మహాత్మగాంధిగారు పోర్టస్మిత్ పట్టణమును 1940 లో సందర్శించి తన అనుభవములను గూర్చియిట్లు వ్రాయుచున్నారు:—

"పోర్టుస్మిత్ మల్లాహోంకా బందర్ హై. వహాం దురాచారిణీస్త్రీయోంకీబహుత్ సే ఘర్ హైం. వేస్త్రీయాం వేశ్యాతోనహీ కహీజాసక్తీ; .... యహ్కహ్నా కఠిన్ హోజాతాహైంకి కౌన్ ఘర్ అచ్ఛా ఔర్ కౌన్ బురా" (పోర్టుస్మిత్ ఒకరేవు పట్టణము. అక్కడ చాలమంది దురాచారిణులైన స్త్రీలున్నారు. ఆస్త్రీలను

వేశ్యలని చెప్పజాలము ...... ఆపట్టణములో యెన్నియిళ్లుమంచివి గలవో చెప్పడంచాలకష్టం)సోదరులారా!ఇదిపాశ్చాత్యనాగరికత! దీనిపేరే Western civilization! అయితేమీరాలో కొందరు ప్రశ్నింపవచ్చు. మనదేశంలో మాత్రం డబ్బుకాసించి శరీరం అమ్ముకొనే స్త్రీలు యెంత మంది లేరని! కాని, వీరుడబ్బుకోసరం చేస్తున్నారు. వారు ఫ్యాషన్కోసరం డబ్బు లేకుండానే నిస్వార్థంగా షోకుగా వ్యభిచరిస్తారు. అందుకోసరమే గాంధిగారు "వారినివేశ్యలని చెప్పజాలము" అనివ్రాసింది. ఈ నాగరికతనేనా మనవారుకోరేది ?? ఛీ! ఛీ! ....

(Hear, Hear, వినుడు, వినుడు) ....సోదరులారా! ఈ నాగరికతను వీడ్కోలివ్వండి! బిడ్డలకు చిన్నప్పటి నుండి మనభారతీయనాగరికతను, బోధించండి! ఆంగ్లేయులు వ్రాసిన హిందూ దేశచరిత్రలను విశ్వసించకండి! భారతీయులలోని హార్దిక సౌందర్యాన్ని పిల్లలకు చూపెట్టండి? స్వామి వివేకానంద అమెరికాలో హిందూ మతాన్ని గురించి ఉపన్యసించినపుడు ప్రజలు ఆశ్చర్యపోయినారు. హిందూ మత మిట్లాంటిదని వారికితెలియదు! పాపం! "అందుచేతనే మేమీ అంధకారములోపడి కొట్టుకొంటున్నాము" అని ఒక జర్మనీ క్రైస్తవ పండితుడన్నాడు. తరువాత ఆతడు హిందూమతాన్ని స్వీకరించాడు. అతడే సాధనానందస్వామి !!! స్వామి సత్యదేవుగారు జర్మనీలో ఆర్యధర్మ ప్రచారంచేస్తూ "బెర్లిన్"లో ఉపన్యసించినపుడు వారు చకితులై ఆర్యధర్మాన్ని వెయినోళ్ళ ప్రశంసించారు. సోదరులారా! అట్లాంటి పవిత్ర ధర్మాన్ని వదలకండి! మూఢాచారములను విశ్వసించకండి! సత్యమైన వేద ధర్మాన్నిస్వీకరించండి! సనాతనులమని పేరు పెట్టుకొని తిరిగే దొంగలను నమ్మకండి ! వారేమతహంతకులు! శ్రద్ధానందులవంటి మహానుభావుల చరిత్రలను చూచి మతంకోసరం ప్రాణాలను బలిదానంచేయడం నేర్చుకోవాలి! లోకమాన్యతిలక్ అడుగు జాడలలో దేశానికోసరం సర్వస్వాన్నిత్యజించడానికి సిద్ధపడాలి!! నిజమైన హిందూమతాన్ని ఆశ్రయించండి!! తిరిగి మనసౌభాగ్యం మనకొస్తుంది!

తూర్పున ఉదయించిన సూర్యుడు పశ్చిమానికి పోవడం సహజం! కాని, ఎప్పుడూ అక్కడే వుండడు. తిరిగి తూర్పున ఉదయించాలి. భావిభారత సౌభాగ్యోదయానికి స్వాగతమిద్దాము! మన హృదయపూర్వకమైన ప్రేమకానుకల నర్పిద్దాము! దేశంకోసరం మన రక్తాన్ని ధారబోసి రక్తరంజిత భారత్‌ను మనకుమారులకు చూపుదాము! రాబోవు తరములవారికి ఆదర్శప్రాయులుగా నిలుద్దాము! పాశ్చాత్య నాగరికతకు దూరంనుంచేదణ్ణంపెట్టుదాము "అని మోహనరావు గంభీరంగా ఉపన్యాసించాడు. సభికులంతా మౌనంగా చకితులై విన్నారు. నిజంగా, మోహనరావునోటినుండి వెలువడిన ప్రతిఅక్షరం సభికులహృదయాలలో అంకితమైపోయింది. ఉపన్యాసం ముగియడంతోటే కరతాళధ్వనులు చెలరేగినయి! "జై! స్వాతంత్ర్యమహా భారత్‌కీ జయ్!" అని కొంతమంది కేకలువేశారు. చాలామంది ఫ్యాషన్ ఉపాసకులు తలలువంచుకొన్నారు. నాటినుండి పాశ్చాత్యసభ్యతను బహిష్కరించడానికి నిశ్చయించుకొన్నారు. ఆర్యులు అనాగరికులని పిచ్చికేకలువేసే అనేకమంది యువకులు సిగ్గుపడ్డారు. ఆనాటినుండి, మోహనరావు గుంటూరులో సుప్రసిద్ధనాయకులలో ఒకడుగా పరిగణింపబడసాగాడు. అతనిభాషలో అతని వాక్కులో ఒకవిధమైన ఉత్తేజనాశక్తివుంది! అందుచేత కొన్ని రోజులలోనే అతడొక సుప్రసిద్ధవక్త అయినాడు.

ఉపసంహారం

మోహనరావుకు సంపూర్ణ ఆరోగ్యం కలిగింది. తిరిగి మొదటి శాంతియుత వాతావరణంలోకి రావడమే అతనిమానసిక రోగాన్ని కుదిర్చింది. గుంటూరుకువచ్చిన మరురోజే కొన్నిఇంగ్లీషుగ్రంథాలు బీరువాలోంచితీసి తగలబెట్టేశాడు. అందులో ముఖ్యంగా 'ఆస్కార్ వైల్డ్' రచనలున్నాయి. ఇప్పుడు మోహనరావుకు ఇంగ్లీషు నవల

లంటే వ్యామోహంతగ్గింది. ఎప్పుడైనా చదివితే 'రస్కిన్' 'ఎమర్సన్' 'కార్లయిల్' మొదలైనవారి రచనలుమాత్రం అప్పుడప్పుడు చదువు తుంటాడు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకే నిద్రలేచి స్నానాదిక ములుచేసుకొని సంధ్యోపాసనచేస్తాడు. తరువాత కొంచెంపాలుతాగి ఆఫీసులో కూర్చుంటాడు. 10 గంటలకు భోంచేసి కోర్టుకువెళ్ళి సాయంత్రం 5 గంటలకు యింటికివచ్చి యేదైనా చదువుకొంటూ కూర్చుండేవాడు. సాయంత్రంపూట తిరిగీ స్నానం సంధ్యోపాసనా చేసేవాడు.

సరోజనిగూడా మొదటిసరోజనిగా మారిపోయింది. నడ మంత్రపు జరిగిన విషయాలనన్నిటిని స్వప్నంలాగా మరిచిపోయింది. స్త్రీస్వాభావికమైన లజ్జ, భిడియం సరోజనిని తిరిగీ ఆశ్రయించినయి! ఇంటిలోని పనులనన్నిటిని స్వహస్తంతోనే చేసేది. మరొకరుచేస్తే తనకు సంతృప్తిగా వుండేదికాదు. అత్తగారు మునుపటికంటె యెక్కువగా ప్రేమిస్తున్నది. అత్తాకోడండ్రు యిరువురు చాలఅన్యోన్యంగా ప్రేమతో వుండేవారు. అత్తగారు యేక్రొత్తవిషయంవిన్నా కోడలుతో చెప్పేది. ఎవరైనా ఏమైనా తినుబండారాలుయిస్తే వెంటనే కోడలుచేతికిచ్చేది. తీరికచిక్కినపుడు సరోజని "రామాయణం" "భారతం" చదు వుకొనేది. అవి చదివేటప్పుడు మొదటిఆనందాన్నే అనుభవించేది. అప్పుడపుడు మద్రాసు స్నేహితులదగ్గరనుంచి ఉత్తరాలు వచ్చేవి. కాని వాటిని చింపిపారేసేది. కొన్నాళ్ళయాక ఉత్తరాలు రావడంగూడా మానివేసినయి. Mr. రెడ్డి, శ్రీమతి బాల్డిలనుగురించి చాలఅపవాదులు బయలుదేరినట్లు, మిస్సెస్ బాల్డి భర్త Divorce (విడాకులు) యిచ్చి నట్లు యీమధ్యవార్తలు వచ్చినయి. ఇట్లాంటి సమాజంలోనుంచి బయటపడినందుకు సరోజని, మోహనరావులు భగవంతునికి అనేక ధన్యవాదాలు అర్పించారు !.

రాత్రి 10 గంటలయింది. పౌర్ణమినాటికర్పూరంలాంటి పండు వెన్నెల వెల్లివిరిసిపోతున్నది. చంద్రుడు బ్రహ్మానందంగా పకపకా నవ్వుతున్నాడు. చల్లనిపిల్లగాడ్పులు రెపరెపాధ్వనిచేసుకొంటూ పరుగెత్తిపోతున్నాయి. సరోజని, మోహనరావు లిరువురూ, మేడమీద అరుబయటపడుకొని ఆనందంగా చందమామవైపు చూస్తున్నారు. ఎవరు ఎక్కువసేపు కన్నుమూయకుండా, చంద్రుడిని చూడగలుగుతారోనని పందేలువేసుకొని, జాబిల్లిలోని అమృతరసాస్వాదన చేస్తున్నారు. ఇరువురూ " నీవు ఓడిపోయా " వంటే " నీవు ఓడిపోయా " వని పకపకా నవ్వుకొంటున్నారు. ఇంతలోనే అకస్మాత్తుగా సరోజని, " మన ఆనందాన్ని ఇనుమడింపజేయడానికొక 'చిట్టినాయన' గూడా వుంటే యెంతబాగుండేది ! " అని కొంచెంసిగ్గుతో, చిరునవ్వుతో అన్నది.

" నీవు సంతాననిరోధకం చేయకుండావుంటే అల్లాగే కలుగుతారు ! దానికి నేను గ్యారంటీయిస్తాను " అని మోహనరావు నవ్వుతూ అన్నాడు,

" చాల్లెండి, మీమాటలు మీరూనూ ! ... ఎప్పుడూ హేళనచేస్తుంటారు ...... " అని సరోజని పెదవి విరచి కొంచెం నవ్వింది.

ఇరువురూ పకపకా నవ్వారు !!

" ఓం ఇతిశమ్ "

శ్రీ వేమన (గ్రం)థాలయము
తేలప్రోలు (కృష్ణా)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA126B123
పుస్తకం పేరు	ఫ్యాషన్
తారీఖు	30/10/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	47
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	narma
పేజీలు విడదీసినది	narma
స్కాన్ చేసినది	Ch. Ramya
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	no
పరిస్థితి	good